epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 28 | 07-04-2026 మంగళవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00






## హోర్ముజ్ జలసంధిని
# వెంటనే తెరవండి

ఇరాన్‌పై తీవ్రపదజాలంతో విమర్శలు

లేదంటే సర్వనాశనం చేస్తాని ట్రంప్ వార్నింగ్

లెక్కచేయకుండా ప్రతిదాడులకు దిగుతోన్న ఇరాన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. హోర్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరించారు. మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హోర్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. నరకంలో ఉన్నట్లే. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి అంటూ ట్రంప్ పేర్కొన్నాడు. అంతేకాదు.. ఇందుకోసం రాయలేని రీతిలో బూతు పదాల్ని వాడాడు. హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే.

## ఇజ్రాయెల్‌కు విమాన సర్వీసులు నిలిపివేత

ఎయిర్ ఇండియా వెల్లడి




న్యూఢిల్లీ అక్షరకలం ప్రతినిధి

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ప్రముఖ విమాన యాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు వెళ్లే సర్వీసులను, అక్కడి నుండి వచ్చే అన్ని విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రయాణికులు, విమాన సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ఈ కాలంలో ప్రయాణానికి ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని, లేదా ఒకసారి ఉచితంగా ప్రయాణ తేదీని మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామని ప్రకటిచింది. మే 31 తర్వాత అప్పటి పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

## ఆదిలాబాద్‌కు
# గోదావరి నీరు పారిస్తా



- తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
- జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడి హట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలా బాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు.

వివరాలు 2లో..

## బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

### మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ



ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందుకు తగినట్లుగా వ్యూహాలు రచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సింగరేణి కార్మికులతో భేటీ అవ్వగా తాజాగా సోమవారం బంజారా నేతలను కలిశారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు.

వార్త 2లో

## కెసిఆర్ కార్యాలయంపై దాడి

### గజ్వేల్ బంద్‌తో మూతపడ్డ దుకాణాలు

గజ్వేల్, అక్షరకలం ప్రతినిధి

గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. ఆర్టీసీ బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. బంద్ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కు దాడుల సమాచారం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు హామీలపై దృష్టి సారించాలని సూచించారు. హామీలను మరిచి ప్రతిపక్షాలపై దాడులు చేయడమేంటని వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా వారి ఆఫీసుల్లో మోదీ ఫోటో పెట్టారా అని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యేల ఆఫీసుల్లోనూ సీఎం ఫోటో పెట్టిస్తారా అని ప్రశ్నించారు. గజ్వేల్ ఎమ్మెల్యే అధికార కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణుల దాడికి నిరసనగా గజ్వేల్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ శ్రేణుల పిలుపు మేరకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నారు. గజ్వేల్ బంద్‌లో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారెంటీలపై గ్రామాలకు వెళితే తెలుస్తుంది

2

## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ సాహసోపేతం

### ట్రంప్‌కు నెతన్యాహు ప్రశంసలు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

: పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ, అమెరికా చేపట్టిన సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్‌పై అంతర్జాతీయంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదంలో చిక్కుకున్న అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని సురక్షితంగా కాపాడిన తీరును ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు కొనియాడారు. ఇరాన్ సరిహద్దుల సమీపంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో, సాంకేతిక కారణాల వల్ల లేదా శత్రు దాడుల వల్ల అమెరికాకు చెందిన ఒక ఎఫ్-15 యుద్ధ విమానం ప్రమాదానికి గురైంది. అయితే, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా సైన్యం మెరుపు వేగంతో స్పందించి, ఇరాన్ గగనతలాన శోధించి ఆ విమానంలోని సిబ్బందిని ప్రాణాలతో కాపాడిన సంగతి తెలిసిందే. ఈ విజయంపై నెతన్యాహు స్పందిస్తూ.. ఇది అమెరికా సైనిక సామర్థ్యానికి, అధ్యక్షుడు ట్రంప్ దృఢ నిశ్చయానికి నిదర్శనమని పేర్కొన్నారు.

2 లో..



## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది.

# హార్ముజ్ జలసంధిని వెంటనే తెరవండి

### ఇరాన్‌పై తీవ్రపదజాలంతో విమర్శలు

### లేదంటే సర్వనాశనం చేస్తాని ట్రంప్ వార్నింగ్

### లెక్కచేయకుండా ప్రతిదాడులకు దిగుతోన్న ఇరాన్

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హార్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. హార్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరించారు. మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హార్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. నరకంలో ఉన్నట్లే. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి అంటూ ట్రంప్ పేర్కొన్నాడు. అంతేకాదు.. ఇందుకోసం రాయలేని రీతిలో బూతు పదాల్ని వాడాడు. హార్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. తాను చెప్పినట్లు చేయకపోతే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తీవ్రంగా గాయపడిన తమ ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల నుంచి రక్షించామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. పగటిపూటే.. దాదాపు ఏడు గంటలపాటు శ్రమించి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేశామన్నారు. పౌరులకు, విమానాలకు ఎక్కువ ప్రమాదం ఉండే ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదని చెప్పారు. అయితే, ట్రంప్ హెచ్చరికను ఇరాన్ తేలికగా తీసుకుంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ కూడా కువైట్, బహ్రెయిన్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తోంది. అలాగే, తమ దేశంలోని పౌర కేంద్రాలపై దాడులు చేస్తే తాము కూడా మరింత బలంగా దాడి చేస్తామని ఇరాన్న ఇప్పటికే హెచ్చరించింది. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు లెబనాన్



రాజధాని అయిన బీరుట్‌పై దాడులు చేస్తున్నాయి. అలాగే, ఆదివారం అమెరికాకు చెందిన యుద్ధ విమానాల్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. సీ-130 అనే రెండు రవాణా విమానాల్ని, రెండు బ్లాక్ హ్యాక్ అనే హెలికాప్టర్లను కూల్చినట్లు తెలిపింది. మరోవైపు అణు ఆధారిత విద్యుత్ క్షేత్రాలపై దాడుల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సివస్తుందని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. రేడియో ధార్మిక పదార్థాలు భూ, జలాలు, వాతావరణంలోకి విడుదలయితే ఇరాన్‌తో పాటు ఇరాన్ ఆవల కూడా మానవ, పర్యావరణ విపత్తులకు దారితీయవచ్చునని పేర్కొంది. అందువల్ల అమెరికా, ఇజ్రాయిల్ తమ దేశంలోని అణు విద్యుత్ స్థావరాలను లక్ష్యం చేసుకొని చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించాల్సిందిగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెర్రెస్‌కు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒక లేఖ రాశారు. ఈ లేఖను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు పశ్చిమాసియాలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ఎ÷-లాంటుపై నాలుగుసార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు. దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని లెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.

# బంజారాలకు పార్టీలో తగిన ప్రాధాన్యం

### మాజీ ఐపిఎస్ డిటి నాయక్‌తో కవిత భేటీ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ప్రకటించబోతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అందుకు తగినట్లుగా వ్యూహాలు రచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల సింగరేణి కార్మికులతో భేటీ అవ్వగా తాజాగా సోమవారం బంజారా నేతలను కలిశారు. రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో కవిత భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లిన కవిత మర్యాద పూర్వకంగా వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తన కొత్త రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కవిత వారిని కోరారు. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే దానిపై వారితో కూలంకషంగా ఆమె చర్చించారు. ఆ సామాజిక వర్గానికి ఏం చేయాలో అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే మొదటిసారి అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఏర్పాటు చేయబోయే పార్టీలో వారికి సముచిత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంజారా ప్రముఖులంతా తాము ఏర్పాటు చేయబోయే పార్టీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే వారిని తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.

# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

### పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# ఆరు గ్యారెంటీలపై గ్రామాలకు వెళితే తెలుస్తుంది

### ఏ మేరకు అమలు చేశారు ప్రజలను అడగండి

### కేరళకు వెళ్లి అబద్దాలు ప్రచారం చేయడం కాదు

### మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు

నల్లగొండ, అక్షరకలం ప్రతినిధి

కేరళం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లి గొప్పలు చెప్పడం తప్ప, అక్కడ రేవంత్‌ను చూసి ఓటేసేదెవరిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలయ్యాయని నిరూపించగలరా అని సవాల్ చేశారు. శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు ప్రజలకు ఇచ్చిన హామీలపై సర్కారును ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. సీఎం స్థాయిని రేవంత్‌రెడ్డి దిగదార్చేలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తును అభాసుపాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ఎక్కవ కాలం ప్రజల్లో నిలువలేరని అన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి రేవంత్ మన పరువు తీస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో తిరిగి తాము ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రజలను అడిగితే చెబుతారని అన్నారు. ప్రధాన అంశాలైన గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ పద్దులపై చర్చలు నడుస్తున్న సమయంలో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారానికి వెళ్లాడని వివరించారు. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు ఆఫీసుపై చేసిన దాడి ప్రభుత్వ కార్యాలయంపై దాడేనన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్‌పై బురజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ మంత్రి పార్లమెంట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుపై నెగెటివ్‌గా మాట్లాడారని, ఆయనకు తన శాఖపై పూర్తి అవగాహన లేదన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో ఆ నియోజకవర్గ ప్రజలతో రెఫరెండం పెట్టిస్తే తెలుస్తుందన్నారు. బయటకు వస్తే కాంగ్రెస్ అంటూ, విచారణ జరిపితే ఎమ్మెల్యే పదవి పోతుందని బీఆర్ఎస్‌లో ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం ఊసరవెల్లి రాజకీయాన్ని తలపిస్తున్న దన్నారు. మేడారం జాతరలో నాసిరకం పనులు చేయడంతోనే రెండు టన్నుల



బండరాయి బాలుడి కాలుపై పడి తీవ్ర గాయాలవడంతో వైద్యులు ఆపరేషన్ చేసి కాలు తొలగించారని అన్నారు. ప్రమాదాలపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో భూగర్భ జలాలు సమృద్ధి ఉంటే కాంగ్రెస్ పాలనలో అడుగంటుతున్నాయని, దీంతో వ్యవసాయ బావుల్లో రైతులు పూడిక తీస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలన కాదని, ప్రజాపీడిత పాలన అని ఆయన ఆరోపించారు. తెలంగాణలో ఫ్యాక్ష న్ రాజకీయాలు, దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి పాల్పడుతున్నాడని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై నిలదీస్తుంటే దిక్కుతోచని స్థితిలో కాంగ్రె స్ దాడులకు తెగబడుతున్నదన్నారు. హామీలు మరిచి దాడులతో డైవర్షన్, కరప్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని ఆరోపించారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేసే వారికి ఎలా బుద్ధి చెప్పాలో తెలంగాణ ప్రజానికానికి తెలుసని ఆయన పేర్కొన్నారు.

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా

### తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

### బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి

### ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన

### త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు

### పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి

### జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు

### పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి


ఆదిలాబాద్, అక్షరకలం ప్రతినిధి



గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని



చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్భంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచంలో సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలు ఇవే!

పర్యటనలే మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి. 'ఓ ఏడాది గడిచిపోయే సరికి ఇంతకుముందు చూడని ప్రదేశానికి వెళ్లిరావాలి' అంటారు బౌద్ధ గురువు దలైలామా. ఇంటినుంచి అడుగు బయట పెట్టకపోతే మాత్రం ఉన్నచోటనే ఉండిపోతాం. అదే కొత్త ప్రదేశాలను చుట్టేసి వస్తే కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకుంటాం. మనసు విశాలమవుతుంది. ఇలాంటి దర్శనీయ స్థలాలు ప్రపంచంలో చాలానే ఉంటాయి. వాటిలోంచి ఈ ఏడాది సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలను సిఫారసు చేస్తున్నారు పర్యాటక నిపుణులు. మనం ఎంచుకునే చోటును బట్టి, మన జీవనశైలిని బట్టి వ్యయాలు మారుతూ ఉంటాయి. శ్రీలంక రాజధాని కొలంబో సమీపంలోని సముద్రతీర నగరం నెగొంబో. బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనే ఉంటుంది. సముద్రపు కయ్య (లగూన్)ను అనుసరించుకుని ఉన్న నెగొంబో శ్రీలంకలో పురాతనమైన చేపల పరిశ్రమకు నెలవైన నగరం. ఇక్కడి బీచ్ ప్రశాంతంగా ఉంటుంది.

సముద్రం మీద మత్స్యకారులు చేపల్ని వేటాడే దృశ్యాలు కట్టిపడేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సముద్రంలో మునిగిపోయిన బ్రిటిష్ సరుకు రవాణా విమానాన్ని చూడటానికి డైవింగ్ సదుపాయం ఉంటుంది. తీర ప్రాంతంలో మడ అడవులు ప్రత్యేక ఆకర్షణ. వీటిని చూడటానికి పడవ సదుపాయం ఉంది. అలా వెళ్తూ వెళ్తూ నీటి ఉడుములు, వలస పక్షులను చూసి పరవశించిపోవచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్నేశ్వరం దేవాలయం, స్థానికంగా ఉండే చేపల మార్కెట్ కూడా దర్శనీయమే. ఇక్కడి పెద్దపెద్ద హొటళ్లు విండ్ సర్ఫింగ్, సెయిలింగ్, స్కీయింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తుండటం విశేషం.

## కోహ్ కేర్, కాంబోడియా

కాంబోడియా దేశంలోని పవిత్ర నగరం. నాలుగున్నర చదరపు మైళ్ల విస్తీర్ణంలో నెలకొన్న దేవాలయాల సముదాయమే కోహ్ కేర్. ప్రసాత్ థామ్ అనే ఏడంతస్తుల పిరమిడ్ ఇక్కడి ప్రసిద్ధ నిర్మాణం. రకరకాల శిల్పాలు, రాతి చెక్కడాలు, కొలనులు, పురాతన నిర్మాణాలతో పెనవేసుకుని భారీగా పెరిగిపోయిన చెట్లు ప్రధాన ఆకర్షణ. దగ్గరి విమానాశ్రయం సియెమ్ రీప్.

## ముస్తాంగ్, నేపాల్

నేపాల్ హిమాలయ దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ముస్తాంగ్ ప్రాంతం చూపు తిప్పుకోనివ్వని అన్నపూర్ణ, ధవళగిరి హిమగిరులు, పర్వతాల మధ్య మలుపులు తిరుగుతూ లోయల్లో హొయలొలికే నదులు, మంచుకొండల నుంచి నెమ్మదిగా జాలువారుతున్న హిమనదాలు, ఎత్తుపల్లాలతో కూడుకున్న లోయలు, జడలబర్రెలు, గొర్రెలతో ముస్తాంగ్ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మనదేశానికి పొరుగునే ఉండే నేపాల్‌లో పర్యటన సులభమే.

## అల్మాటీ, కజక్‌స్తాన్

మధ్య ఆసియా దేశం కజక్‌స్తాన్‌లో అతిపెద్ద నగరం. పురాతనమైన సిల్క్‌రోడ్‌లో వెలసిన అల్మాటీ కజక్‌స్తాన్‌లో అత్యంత అందమైన నగరం. ట్రాన్స్ ఇలి ఆల్టాయ్ పర్వతాల నేపథ్యంతో ఉండే అల్మాటీ మంచి ప్రణాళికతో, దారికి రెండువైపులా చెట్లతో కూడిన రోడ్లు, లెక్కలేనన్ని పార్కులు, తోటలతో సందర్శకులకు మధురానుభూతులను అందిస్తుంది. ఇక్కడి అసెన్షన్ కేథడ్రెల్ ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన కొయ్య కట్టడం. దీన్ని 1907లో నిర్మించారు.

## డొమినికా

కరీబియన్ దీవుల్లో కొలువైన 750 చదరపు కిలోమీటర్ల దేశం డొమినికా. అగ్నిపర్వతాలు, ఉష్ణమండల వర్షారణ్యాలు, అంతెత్తునుంచి జాలువారే జలపాతాలు ఇక్కడి ఆకర్షణ. అందుకే దీన్ని 'ప్రకృతి ద్వీపం' (నేచర్ ఐలాండ్) అని పిలుచుకుంటారు. దట్టమైన అడవులు, అందమైన రోజో లోయ, దాదాపు 200 అడుగుల వెడల్పుతో.. పొగలుకక్కుతూ మరిగే నీటి సరస్సు సందర్శనీయ స్థలాలు.

## మసా అండ్ కరారా, ఇటలీ

కళా ప్రేమికులకు స్వర్గధామం ఇటలీలోని మసా అండ్ కరారా ప్రావిన్స్. మన హిమాలయాలను తలపించే అపువన్ ఆల్ప్స్ పర్వతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ప్రపంచ ప్రసిద్ధ పాలరాతి గనులు ఇక్కడే ఉన్నాయి. మైఖేలాంజిలో రూపొందించిన సుప్రసిద్ధ శిల్పం డేవిడ్ ఇక్కడి పాలరాతితో తీర్చిదిద్దిందే. రోడ్డు వారగా శిల్పుల ఉలి సవ్వళ్లు వినిపించడం మసా అండ్ కరారా విలక్షణత. ఆల్ప్స్ పర్వతాలకు తోడు మధ్యధరా సముద్రతీర బీచ్‌లు, భారీతనం ఉట్టిపడే క్రైస్తవ కేథడ్రెల్‌లు, మధ్యయుగాల ఐరోపా చరిత్రను గుర్తుకుతెచ్చే కోటలకు మసా అండ్ కరారా పెట్టింది పేరు.

## లద్దాక్, భారత్

హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ కనుమ మీదుగా అటల్ టన్నెల్ గుండా సాగిపోతే కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ చేరుకుంటాం. ఆకాశాన్ని అందుకునే హిమాలయాలు, పాతాళాన్ని తాకే పర్వత లోయలు, సింధు, ష్యోక్ నదుల ఒయ్యారపు మలుపులు, బౌద్ధ మఠాలు, జడలబర్రెలు, కొండగొర్రెలు, నల్లమెడ కొంగలు, స్వచ్ఛమైన సరస్సులు లద్దాక్ ఆకర్షణలు. ఇక్కడి పెద్ద పట్టణమైన లేహ్‌లో మార్కెట్లు, మ్యూజియంలు, తొమ్మిది అంతస్తుల రాజభవనం చూడదగిన ప్రదేశాలు.



## బ్రెసీలియా, బ్రెజిల్

దక్షిణ అమెరికా ఖండంలో పెద్దదేశం బ్రెజిల్ రాజధాని నగరం బ్రెసీలియా. ప్రణాళికా బద్ధంగా నిర్మించిన ఈ నగరం అధునాతనమైన తెల్లటి భవంతులకు తార్కాణం. బ్రెజిల్ దేశపు అధ్యక్షుడి నివాసం పలాసియో ద అల్వొరడా కొత్త రూపాన్ని సంతరించుకుని ఈ ఏడాది మళ్లీ ప్రారంభం కానుంది. ఆధునిక నగర ప్రణాళికకు నమూనాగా నిలిచే బ్రెసీలియా నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చోటు దక్కింది.

## యమగూచి, జపాన్

స్వచ్ఛమైన ఉద్యానవనాలు, ఐదు అంతస్తుల రూరికోజీ ఆలయ పగోడాకు ప్రసిద్ధి చెందిన నగరం యమగూచి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన బౌద్ధ మందిరం రూరికోజి పగోడాను జపాన్ జాతీయ సంపదల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఇక నగరంలోని మలుపులు మలుపుల వీధులు యుద్ధ వ్యూహాన్ని అనుభూతికి తెస్తాయి.

## న్యూజిలాండ్

దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా ఉన్న దేశం న్యూజిలాండ్. ఉత్తర, దక్షిణ న్యూజిలాండ్ ప్రధాన దీవులు కాగా,



చిన్నచిన్న దీవులు అనేకం ఉన్నాయి. క్రియాశీల అగ్నిపర్వతాలు, చూపు తిప్పుకోనివ్వని గుహలు, హిమనదాలతో ఏర్పడిన లోతైన సరస్సులు, అందమైన లోయలు, పొడవైన బీచ్‌లు, మంచుతో కప్పి ఉండే ఎత్తయిన పర్వతాలకు నిలయం ఈ దేశం. కివీ పక్షులు మరో ఆకర్షణ. న్యూజిలాండ్‌ను రోడ్డు ద్వారా వెళ్తూ చూడాలని పర్యాటకులు కోరుకుంటారు. కానీ రైలులో చుట్టేయడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇలా న్యూజిలాండ్‌ను తిరగడానికి 17 రోజులు పడుతుంది.

మావుయీ, అమెరికా

అమెరికాకు చెందిన హవాయీ దీవుల్లో భాగమే ఈ మావుయీ ద్వీపం. పసిఫిక్ మహాసముద్రం ఓ వైపు.. కాలుష్యం జాడలు లేని స్వచ్ఛమైన బీచ్‌లు, కొబ్బరిచెట్లు, ఎత్తయిన పర్వతాలతో కూడిన 700 చదరపు కిలోమీటర్ల ద్వీపం ఇది. హాలియాకలా నేషనల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణ. ఇక కామావుల్ స్టేట్ బీచ్‌లో ముఖానికి స్నార్కెల్ పెట్టుకొని సముద్ర గర్భాన్ని చూస్తూ ఈదులాడొచ్చు. బీచ్‌లో సేదదీరుతూ సముద్ర తాబేళ్లను చూస్తూ అవ్యక్తమైన ఆనందానుభూతికి లోనుకావొచ్చు.

## మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్పియర్ రిజర్వ్, మెక్సికో

ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో సుమారు 1,40,000 ఎకరాల్లో విస్తరించిన అటవీ ప్రాంతం.. మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్పియర్ రిజర్వ్. శిశిరం వచ్చిందంటే సరి.. బహుదూరాల నుంచి వలసవచ్చిన కోట్లాది మోనార్క్ జాతి సీతాకోకచిలుకలు ఈ పార్కులో సందడిచేస్తాయి. ఈ వలస కాలంలోనే సీతాకోకచిలుకలు నాలుగు తరాలు పుట్టి మరణిస్తాయట. యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ బయోస్పియర్ రిజర్వ్ మెక్సికో నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

## తెస్సాలోనికి, గ్రీస్

గ్రీస్ దేశంలో ఏజియన్ సముద్ర తీరంలో ఉన్న ఈ నగరం పర్యాటక ప్రియులు అత్యధికంగా తరలివచ్చే ప్రదేశాల్లో ఒకటిగా ప్రసిద్ధిచెందింది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో 'గ్రీకువీరుడు' అలెగ్జాండర్ ద గ్రేట్ సోదరి తెస్సాలోనికె పేరుమీదుగా ఆమె భర్త కసాండర్ ఆఫ్ మాసిడోన్ స్థాపించాడు. ప్రాచీన గ్రీకుల కాలపు కట్టడాలు, బైజాంటైన్ సామ్రాజ్యం మొజాయిక్ చిత్రాలు, ఒట్టోమాన్ తురుష్కుల కాలపు కట్టడాలతో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక లక్షణాలతో అలరారుతున్న నగరం తెస్సాలోనికి.

## సింగపూర్

ఆసియా ఖండానికి చెందిన నగర దేశం సింగపూర్ నిజంగానే పర్యాటకుల స్వర్గధామం. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే మలక్కా జలసంధి ప్రాంతంలో భూమధ్య రేఖ సమీపంలో నెలకొన్న సింగపూర్‌లో %ా% మెరీనా బే బీచ్ ఇసుకతిన్నెలు, కళ్లు చెదరగొట్టే ఉద్యానవనాలు, కోలాహలంగా ఉండే ఆర్చర్డ్ రోడ్, మండాయ్ అభయారణ్యంలోని పక్షుల పార్కు, పులావు సెంటోసా ద్వీపాలు, సింగపూర్ నేషనల్ మ్యూజియం, ప్రపంచంలోనే అత్యంత అరుదైన మాంగ్రూవ్ అడవులకు నిలయమైన సుంగేయి బులోహ్ వెట్‌లాండ్ అభయారణ్యం ప్రధాన సందర్శన స్థలాలు.

## జెనీవా, స్విట్జర్లాండ్

ప్రకృతి అందాల దేశం స్విట్జర్లాండ్‌లో రెండో పెద్ద నగరం జెనీవా. అనేక అంతర్జాతీయ సంస్థలు ఈ నగరం కేంద్రంగా పనిచేస్తున్నాయి. చాక్లెట్లు, గడియారాలకు జెనీవా ప్రసిద్ధి. ఇక్కడ జెట్ డిఈఎయూ ఫౌంటెయిన్, పూల గడియారం ఎల్‌హార్లోగ్ ఫ్లూరీ, సెయింట్ పియర్ కేథడ్రెల్, ప్లేస్ డ్యు బోర్గ్‌డిఫోర్ తదితర ప్రదేశాలు దర్శనీయాలు. ఇక్కడికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీఈఆర్ఎన్ పరిశోధన కేంద్రం ప్రధాన ఆకర్షణ.

## పారిస్, ఫ్రాన్స్

ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్ ఫ్యాషన్‌కు, ఈఫిల్ టవర్‌కు పేరుగాంచింది. 2024 ఒలింపిక్స్, పారాలింపిక్ ఆటలపోటీలకు ఈ నగరం ఆతిథ్యం ఇస్తున్నది. ఈఫిల్ టవర్‌తోపాటు నోటర్ డామ్ కేథడ్రెల్, లోవర్ మ్యూజియం, ఢిల్లీలోని ఇండియా గేట్‌ను పోలినఆర్క్ ఆఫ్ ట్రయంఫ్, వర్సెయిల్స్ రాజభవనం, డిస్నీలాండ్ చూడదగ్గ స్థలాలు. సీన్ నదిపై నౌకా విహారం అదనపు ఆకర్షణ.

## బ్రూనీ ఐలాండ్, ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా టాస్మేనియా రాష్ట్రంలో పసిఫిక్ మహాసముద్రంలో నెలవైన ద్వీపం బ్రూనీ ఐలాండ్. ఉత్తర, దక్షిణ బ్రూనీ భూభాగాలను కలిపే ఇరుకైన భూసంధి ఇక్కడి ప్రధాన ఆకర్షణ. కుడిఎడమలుగా విస్తరించిన సముద్రం మధ్య రోడ్డు ప్రయాణం ఓ వర్ణించలేని అనుభూతి. ఈ ద్వీపాన్ని మొదటగా 1642లో నెదర్లాండ్స్ నావికుడు ఏబెల్ టాస్మాన్ గుర్తించాడు. గార్డెన్ సీడ్ బ్యాంక్‌లో విత్తనాలు సేకరించవచ్చు. దీనికోసం టాస్మేనియన్ వాకింగ్ కంపెనీ, రాయల్ టాస్మేనియన్ బొటానికల్ గార్డెన్ ఉమ్మడిగా వృక్షశాస్త్ర విజ్ఞానం పెంచుకునేందుకు మూడు రోజుల ట్రెకింగ్ సదుపాయం కల్పించాయి.

## లేక్ టోబా, ఇండోనేషియా

ఇండోనేషియా దేశం సుమత్రాలో 1,707 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించిన అగ్నిపర్వత సరస్సు లేక్ టోబా. సరస్సు మధ్యలో



పులావు సామోసిర్ ద్వీపం ఉంటుంది. సుమారు 70,000 సంవత్సరాల కింద అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల ఈ సరస్సు ఏర్పడింది. పులావు సామోసిర్ బతక్ తెగ ఆదివాసుల సాంస్కృతిక కేంద్రం. కొన్ని రోజులపాటు అడవిలో అలా ప్రశాంతంగా తిరిగి రావాలనుకునే వారికి గొప్ప పర్యాటక ప్రదేశం లేక్ టోబా. అయితే, సరస్సులో నీటి నాణ్యత ఒక్కో దగ్గర ఒకోలా ఉంటుంది. స్థానికులను అడిగి అనువైన చోట మాత్రమే లోపలికి అడుగుపెట్టాలి. ఈ సరస్సులోని నీరు అసహన్ నది గుండా మలక్కా జలసంధిలో కలిసిపోతుంది.

## సావో నేషనల్ పార్క్, కెన్యా

ఆఫ్రికా ఖండ దేశం కెన్యాలో 22,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన అభయారణ్యం సావో నేషనల్ పార్క్. ప్రపంచంలో అతిపెద్ద జాతీయ ఉద్యానవనాల్లో ఇది ఒకటి. ఆఫ్రికా ఏనుగులు, సింహాలు, వివిధ రకాల కోతులు, అడవి దున్నలు, ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, హార్టబీస్ట్ అనే జింకలు, జిరాఫీలు, జీబ్రాలు, వందలాది పక్షిజాతులతో సావో నేషనల్ పార్క్ సందర్శకులకు కనువిందు చేస్తుంది.

## పాసాడెనా, అమెరికా

కాలిఫోర్నియా రాష్ట్రంలో లాస్ ఏంజెల్స్ కౌంటీలో కొలువైన నగరం పాసాడెనా. సెయింట్ గాబ్రియెల్ పర్వతాల నేపథ్యంతో ఈ నగరం చూడముచ్చటగా ఉంటుంది. దీన్ని 1874లో థామస్ బి. ఇలియట్ స్థాపించాడు. పాసాడెనా అంటే 'లోయకు కిరీటం' అని అర్థం. చుట్టుపక్కల ఉన్న జలపాతాలు, ఏంజెలిస్ నేషనల్ పార్కు పాసాడెనాకు ప్రత్యేక ఆకర్షణలు.

## బాజ్ ఎన్‌వావ్‌జో ఇటా కుక్వేని, అమెరికా

అరిజోనా రాష్ట్రంలో భౌగోళిక అద్భుతం గ్రాండ్ కాన్యాన్ పరిసరాల్లో నెలకొంది. దీన్ని గత ఏడాది ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ స్మారకంగా ప్రకటించారు. తొమ్మిది లక్షల ఎకరాల్లో విస్తరించిన బాజ్ ఎన్‌వావ్‌జో పీఠభూములు, కాన్యాన్లు, ఇతర భౌగోళిక అద్భుతాలతో వావ్ అనిపిస్తుంది. 3,000 వరకు సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న స్థలాలు దీని సొంతం. ఆధ్యాత్మికంగానూ ప్రాధాన్యం కలిగిందే. సిందూరపు రంగు పర్వత భాగాలు, ఇతర వన్యప్రాణులు కనువిందు చేస్తాయి.

## వాలెన్షియా, స్పెయిన్

స్పెయిన్‌లో మధ్యధరా సముద్ర తీరంలో నెలకొన్న నగరం. 2,100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నగరం వాలెన్షియా. ద సిటీ ఆఫ్ హండ్రెడ్ బెల్ టవర్స్ అని ఈ నగరానికి మారుపేరు. ఈ స్తంభాలలో మిగులెటె టవర్, టవర్ ఆఫ్ సాంటా కాటలినా ప్రసిద్ధిచెందినవి. నగరం మధ్యలో ఉన్న లా సియో కేథడ్రెల్ కూడా సందర్శనీయ స్థలమే. మధ్యయుగాలకు చెందిన వాలెన్షియా రాజుల కట్టడాలు ఆశ్చర్యపరుస్తాయి. ఎన్నో ఉద్యానవనాలు, ఆర్ట్ మ్యూజియంలు, సిరామిక్స్‌కు వాలెన్షియా పెట్టిందిపేరు. కన్ను ఆకారంలో ఉండే ఎల్‌హెమిస్‌ఫెరిక్, నీళ్లలో ఉండే ఎల్‌ఓషనోగ్రఫిక్ సిటీ కూడా చూడదగినవే. నడుస్తూనే వాలెన్షియాను చుట్టేయవచ్చు.

## సాలార్ డి ఉయుని, బొలీవియా


దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో ఆండీస్ పర్వతాల్లో 12,000 అడుగుల ఎత్తులో నెలకొన్న ఉప్పు నీటి సరస్సు సాలార్ డి ఉయుని. ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌కు గురయ్యే ప్రమాదం పొంచి ఉన్న సాలార్ డి ఉయునికి ప్రయాణించడం సాహసమే. పురాతన సరస్సులు ఎండిపోవడంతో కేవలం లవణాలు మాత్రమే మిగిలిపోయిన నేల ఇది. 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన తెల్లటి ఉప్పునేల మీద సర్‌సర్‌మని మన అడుగుల సవ్వడి తప్ప మరే శబ్దం వినిపించదు.

## ఔరికా లోయ, మొరాకో

మధ్యధరా, అట్లాంటిక్ మహాసముద్రాల్ని ఆనుకుని ఉన్న మొరాకో దేశంలో అట్లాస్ పర్వతాలు ఉన్నాయి. వీటిలోభాగమే ఔరికా లోయ. ఎత్తయిన అట్లాస్ పర్వతాల మధ్య మలుపులు తిరిగే ఔరికా నది వల్లే ఈ ప్రాంతానికి ఈ పేరు. సెట్టి %-% ఫత్మా అనే గ్రామం దగ్గర్లో.. ఏడు జలపాతాల కలయికగా ఔరికా జలపాతాలు ఉంటాయి. సంప్రదాయ అమాజిగ్ ఇండ్లు కూడా సందర్శనీయ స్థలాలే.

## క్రేటర్స్ ఆఫ్ మూన్, అమెరికా

అమెరికాలోని ఇడాహో రాష్ట్రంలో అగ్నిపర్వత పేలుళ్లు, లావా ప్రవాహం వల్ల ప్రత్యేకతను సంతరించుకున్న ప్రాంతం. దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో విస్తరించిన క్రేటర్స్ ఆఫ్ మూన్‌ను అమెరికా ప్రభుత్వం 1924లో జాతీయ ప్రాధాన్యంగల ప్రాంతంగా ప్రకటించింది. అగ్నిపర్వత పేలుళ్ల వల్ల ఏర్పడిన ఎగుడు దిగుళ్లతో ఈ ప్రాంతం అచ్చంగా చందమామ ఉపరితలాన్ని గుర్తుకుతెస్తుంది. అందుకే 'క్రేటర్స్ ఆఫ్ మూన్' అని పేరుపెట్టారు. లావా ప్రవాహం గడ్డకట్టి ఉంటుంది కాబట్టి, ఇక్కడ వృక్షాలు అంతగా కనిపించవు. వర్షపాతం కూడా తక్కువే. అయినా, లావాతో గట్టిపడిన పగుళ్లలో నీళ్లు నిల్వ ఉంటాయి. స్నేక్ నది ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# డొనాల్డ్ ట్రంప్ మలి జూదం

ఫిబ్రవరి 28 నుంచి మార్చి చివరి వరకు 32 రోజులపాటు సాగిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తొలి జూదం విఫలమైంది. దానితో ఆయన యుద్ధం మొదలైన తర్వాత మొదటిసారిగా దేశ ప్రజలను ఉద్దేశించి ఏప్రిల్ 1న ప్రసంగించిన తర్వాత మలి జూదం ఆరంభించినట్లు కనిపిస్తున్నది. ఆ విధంగా, మరుసటి రోజున ఇరాన్‌లోని పౌర సదుపాయాలపై దాడులు మొదలుపెట్టారు. తన ప్రణాళికలకు సరిగా ఉపయోగపడటం లేదని కావచ్చు తమ సీనియర్ సైనికాధికారులకు ఉద్వాసన చెప్పటం చేశారు. ఇకనైనా ఇరాన్ తన షరతులకు పూర్తిగా అంగీకరించి ఒప్పందం చేసుకోనట్లయితే అతి భీకరమైన యుద్ధం సాగించి ఇరాన్‌ను 'శిలాయుగం' నాటి పరిస్థితులలోకి తీసుకు వెళ్లగలనని హెచ్చరించారు. రాగల వారాలలో ఎట్లా సాగగలదో, ఈసారి అయినా ట్రంప్ నెతన్యాహూ కోరుకున్న ఫలితాలను ఇవ్వగలదేమో చూడవలసి ఉంది. ఇరాన్ మాత్రం అమెరికా అధ్యక్షుని ప్రసంగం తర్వాత ఒకసారి, ఆ తర్వాత పౌర సదుపాయాలపై దాడులు మొదలైన తర్వాత మరొకసారి సమాధానమిస్తూ, తమను ఇవేవీ లొంగదీయలేవని ధిక్కరించింది. అంతటితో ఆగక ఆ వెంటనే ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాలలోని అమెరికన్ సైనిక స్థావరాలపై, అమెరికాకు చెందిన హైటెక్ కంపెనీలు, స్టీల్ కంపెనీలపై ఎదురు దాడులు జరిపింది. అమెరికా దాడుల వల్ల ఇరాన్‌లో కలిగిన నష్టాల చిత్రాలు వెంటనే ప్రసారమయ్యాయి. వాటిలో ఒకటి ఇంకా నిర్మాణంలో ఉన్న చాలా ఎత్తయిన వంతెన కాగా, మరొకటి ఔషధ కర్మాగారం. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలలో జరిగిన నష్టాల చిత్రాలు మాత్రం రాలేదు. ఆ దేశాలన్నీ కఠినమైన సెన్సారింగ్ విధించినట్లు పాశ్చాత్య దేశాల మీడియానే ప్రకటిస్తున్నది. అయితే ఈ దాడి గురించి స్వయంగా ఇజ్రాయెల్ ప్రభుత్వమే, ఇరాన్ ఇంతటి భారీ దాడి జరపటం ఇదే మొదటిసారని అంగీకరించటం గమనించదగ్గది. మొదటి దశ యుద్ధ కాలమంతా అమెరికా, ఇజ్రాయెల్ చెప్తూ వచ్చిందేమిటి? ఇరాన్‌ను సైనికంగా 90 శాతం వరకు తుడిచిపెట్టామని, అణు పరిశోధనా కేంద్రాలు, క్షిపణి నిల్వలు, డ్రోన్లు, వాటి నిల్వలు, తయారీ కేంద్రాలు, లాంచర్లు ధ్వంసమైపోయాయని, ఇరాన్ సైన్యంలో అతి కీలక విభాగమైన రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జిసి) నిర్వీర్యమైపోయిందని, వైమానిక బలం యావత్తు మట్టిపాలు కాగా, నౌకాబలమంతా సముద్రం అడుగుకు మునిగిపోయిందని. ఇవన్నీ ట్రంప్ మాటలే. అది తాను ఒకటి రెండు సార్లు కాదు, పదే పదే అంటూ వచ్చారు. అమెరికా సైనిక పాటవం యావత్ ప్రపంచంలోనే అత్యంత బలోపేతమైనది సుమా అని కూడా ప్రతిసారి ఇరాన్‌తోపాటు అన్ని దేశాలకు గుర్తు చేస్తూ వస్తున్నారు. మొదటి దశ దాడులు రెండు రోజులలో ముగియగలవని వారు అంచనా వేయగా 32 రోజులు సాగాయి. అమెరికా తోపాటు ఇజ్రాయెల్ ఉమ్మడి బలాన్ని తట్టుకున్న ఇరాన్ ఇంతకాలం తన ఎదురు దాడులతో ఆ ఇద్దరితోపాటు గల్ఫ్ రాజ్యాలకు తీవ్రమైన నష్టాలను కలిగించింది. వివరాలు ఇక్కడ రాయనక్కరలేదు గాని, అమెరికా, ఇజ్రాయెల్ ప్రచారం చేసినట్లు ఇరాన్ సైనిక శక్తి ధ్వంసం మాత్రం కాలేదని ప్రపంచానికి అర్థమైంది. ఇరాన్ ప్రత్యర్థులకు మరింత బాగా అర్థమైంది. ఇందుకు అదనంగా హర్మ్యూజ్‌ను ఇరాన్ దిగ్బంధించగా, బాబ్ అల్ మందెల్‌ను కూడా దిగ్బంధించేందుకు హూతీలు సిద్ధపడుతుండటం, లెబనాన్, ఇరాక్‌లలోని మిలిటెంట్ సంస్థలు అమెరికా, ఇజ్రాయెల్ సంబంధిత స్థావరాలపై దాడులు ఆరంభించటంతో ఆ రెండు దేశాలకు ఊపిరి సలపకుండా ఉంది. ఇటువంటి స్థితిలో ఏమి చేయాలో తోచని ట్రంప్, ఇరాన్‌పై భూతల యుద్ధం కోసమంటూ సేనలను మోహరించి కూడా వాటిని ఓడలపై నుంచి నేలపైకి దింపటానికి గాని లేదా పారాచూట్ల ద్వారా విమానాల నుంచి జారవిడవటానికి గాని సాహసించటం లేదు. చమురు కొరతలు ఏర్పడి, ధరలు పెరుగుతూ ఇంటా బయటా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటున్న ట్రంప్, తమకు సాయంగా వచ్చేందుకు యూరప్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా సహా ఏ ఒక్కరూ ముందుకు రాకపోవటంతో వారిపై ఆగ్రహిస్తూ, అమెరికా మాత్రం నాటోలో ఎందుకుండాలని ప్రశ్నించటం మొదలుపెట్టారు. దీనంతటి సారాంశం ఏమంటే, 32 రోజుల తొలి దశ యుద్ధం పూర్తిగా విఫలమైంది. దాడులకు ముందు ప్రకటించిన అరడజను లక్ష్యాలలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. మొదటి దశ చివరకు వస్తున్న వేళ, ఇరాన్‌తో రాజీకోసమంటూ 15 షరతులు ప్రకటించారు. ఇరాన్ అడగకుండానే తనంతటతానే అందుకు ప్రతిగా ఇరాన్ అయిదు షరతులు ముందుంచింది. ఆ మొత్తం 20లో ఏ ఒక్కటీ జరిగేది కాదని వాటిని చూసిన వెంటనే అందరికీ అర్థమైంది. జరిగింది కూడా అదే. మరిన్ని కనుగొనండి ఆన్‌లైన్ కోచింగ్ తరగతులు తెలంగాణ వార్తలు వ్యాపార కోర్సులు ఆ విధంగా సాగిన మొదటి దశకు, ఏప్రిల్ 1 నాటి ట్రంప్ ప్రసంగానికి మధ్య గల సంధి దశలో అమెరికా అధ్యక్షుడు ఎపుడేమి అంటున్నారో తెలియని విధంగా ఊగిసలాడారు. లక్ష్యాలన్నీ దాదాపు సాధించి వేశామని, ఇక ఏ క్షణమైనా నిష్క్రమిస్తామని ఒకసారి, దాడులు ఇంకా తీవ్రం చేస్తామని మరొకసారి, ఇరాన్ లొంగిపోవాలని ఒకసారి, లొంగకున్నా సరేనని మరొకసారి, హర్మ్యూజ్‌ను తెరిపించి తీరుతామని ఒకసారి, అటువంటి అంగీకారం కుదరకున్నా పరవాలేదని మరొకసారి, యూరప్ తమకు తోడు రావాలని ఒకసారి, రాకున్నా సరేనని ఇంకొకసారి, అక్కడి చమురు తమకు అవసరం లేదు గనుక మీరే పోయి తెచ్చుకొండని ఒక రోజు మాట్లాడుతూ తమ బలహీనతలను తానే బయట పెట్టుకుంటూపోయారు. తమను అనవసరంగా యుద్ధంలోకి లాగారని ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఇజ్రాయెల్ ప్రధానిపై కేకలు వేసే



వరకు వెళ్లింది పరిస్థితి. మామూలుగానైతే ఇన్నిన్ని వైఫల్యాల దృష్ట్యా అమెరికన్లు ఈ మొదటి దశ అనంతరం యుద్ధం నుంచి నిష్క్రమించాలి. ఇరాన్‌కు చాలా నష్టాలే కలిగించినందున విజయం సాధించినట్లేనని ప్రకటిస్తూ ఇక వెళ్లిపోవటం గౌరవప్రదంగా ఉంటుందని పలువురు నిపుణులు ట్రంప్ కు సూచించారు కూడా. చాలా లక్ష్యాలు నెరవేరాయని ట్రంప్ కూడా అంటుండినందున, నిష్క్రమించగలమనే సూచనలు కూడా చేస్తుండినందున, అదే విధంగా జరగగలదని పలువురు భావించారు. తన ఏప్రిల్ 1 ప్రసంగంలో అదే విషయం ప్రకటించగలరనే అభిప్రాయం కూడా ఏర్పడింది. కాని అంతలోనే ఏమి జరిగిందో తెలియదు గాని, ఆయన మలి దశ యుద్ధాన్ని ప్రకటించారు. యుద్ధం పట్ల దేశంలో వ్యతిరేకత పెరుగుతుండటంతో (ఒక అంచనా ప్రకారం మూడింట రెండు వంతులు. ఆ వ్యతిరేకులలో తన 'మాగా' మద్దతుదారులు కూడా ఉన్నారు.) వారికి నచ్చచెప్పటం కోసమా అన్నట్లు కొన్ని మాటలు చెప్పారు.

# నల్గొండలో "విద్యా విప్లవం"

## సర్కారీ బడికి 'కార్పొరేట్' క్రేజ్.!

## కోమటిరెడ్డి ప్రతీక్ పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రుల క్యూలైన్లు

## తెల్లవారుజాము నుంచే గేట్ల వద్ద నిరీక్షణ

## మంత్రి విజన్‌పై ప్రశంసల జల్లు

**అక్షరకలం నల్గొండ**

సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాల టికెట్ల కోసమో లేదా పేరున్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో సీట్ల కోసమో జనం ఎగబడటం చూస్తుంటాం. కానీ, నల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ 'కోమటిరెడ్డి ప్రతీక్ ఉన్నత పాఠశాల' దృశ్యం చూస్తే ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం ఎంతలా పెరిగిందో అర్థమవుతోంది. సోమవారం ఈ పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు తెల్లవారుజాము నుంచే భారీగా క్యూ కట్టారు.

### కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక సౌకర్యాలు...

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సొంత నిధులతో, ప్రత్యేక చొరవతో ఈ పాఠశాలను సకల సౌకర్యాలతో





తీర్చిదిద్దారు. నేడు ఈ విద్యా మందిరం కార్పొరేట్ పాఠశాలలకు గీటురాయిగా నిలిచింది. ఇక్కడ అందుతున్న వసతులు తల్లిదండ్రుల విశ్వాసాన్ని చూరగొంటున్నాయి.

### డిజిటల్ విద్యాబోధన..

స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఏఐ ఆధారిత బోధన, అధునాతన డిజిటల్ ల్యాబ్స్.క్రీడలు అండ్ మౌలిక వసతులు. విశాలమైన క్రీడా మైదానం, చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం.అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు. నాణ్యమైన బోధనతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది.పౌష్టికాహారం. నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం అమలు.

### జిల్లా దాటి వస్తున్న దరఖాస్తులు..

నల్గొండ జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా ఈ పాఠశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. సీట్లు పరిమితంగా ఉండటంతో అడ్మిషన్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇది కేవలం ప్రభుత్వ పాఠశాల కాదు. కార్పొరేట్ స్థాయికి దీటైన విశ్వవిద్యాలయం అని అడ్మిషన్ల కోసం వచ్చిన తల్లిదండ్రులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను పెంచుతూ, నల్గొండలో విద్యా విప్లవానికి నాంది పలికిన ఈ 'మోడల్ స్కూల్' ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజన్ ప్రభుత్వ విద్యకు కొత్త దిశను చూపిస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

### 170 మంది స్ట్రెంత్.....

ప్రస్తుతం ఈ పాఠశాలలో ప్రైమరీ, హై స్కూల్ కలిపి 170 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.. ఈ విద్యా సంవత్సరం సుమారు 350 మంది వరకు విద్యార్థులకు అడ్మిషన్లను తీసుకుంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యులు రామకృష్ణ తెలిపారు. రెండవ తేదీ నుండి దరఖాస్తు ఫారాలను ఇస్తున్నామని ఈ ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అయితే రెండవ తేదీన నుండి సోమవారం నాటికి సుమారు 1350 దరఖాస్తులు పారాలు విద్యార్థుల తల్లిదండ్రులకు అందించినట్లు తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ప్రజారోగ్యంపై వాకథాన్

## జెండా ఊపిన మంత్రి దామోదర

**హైదరాబాద్, అక్షరకలం**

శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ




మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో పాల్గొన్న వారితో కలిసి మంత్రి జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు నడిచారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ వారం రోజుల పాటు ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.




# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ

## నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల పక్రియ

## సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక

**హైదరాబాద్, అక్షరకలం**

జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల పక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల పక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూట్నీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టు ఆన్‌లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రిడేషన్ జారీ పక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్‌లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

# చిన్నారిపై అత్యాచార యత్నం

## ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు


## సకాలంలో అడ్డుకున్న వ్యక్తికి సన్మానం

**హైదరాబాద్, అక్షరకలం**

మహిళలపై అత్యాచారాలు ఆగడం లేదు. చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకూ కామాంధులు ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదు. ప్రాణాలు తీసైనా సరే అత్యాచారాలకు తెగిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నారులపైనా అఘాయిత్యాలు ఆగడం లేదు. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్ మహానగరంలో చోటు చేసుకుంది. చిన్నారిని కిడ్నాప్ చేసి అత్యాచారయత్నం చేశాడు ఓ కామాంధుడు. గోల్కొండ ప్రాంతంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు విద్యార్థిని(8) ఆటో ఎక్కింది. ఆమెకు మాయమాటలు చెప్పిన ఆటో డ్రైవర్.. గోల్కొండలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి ఏడుపు గమనించిన యువకుడు మహ్మద్ ఫిరోజ్ అప్రమత్తమై ఆటో వద్దకు వెళ్లారు. కామాంధుడి నుంచి బాలికను కాపాడారు. దీంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. స్కూల్ ఐడీ కార్డు ద్వారా విద్యార్థిని తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు ఫిరోజ్. అక్కడికి చేరుకున్న పోలీసులు బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

ఆట



# సలీల్ అరోరాపై అందరి ఫోకస్ ఉంటుంది

## సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్

పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ తెలిపాడు. జట్టులో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారని, వారంతా సూపర్ ఫిట్‌గా ఉన్నారని, ఈ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చెప్పాడు. రజత్ పటీదార్ టాస్ గెలవడంతో ఆర్‌సీబీ అభిమానుల నినాదాలతో స్టేడియం దద్దరిల్లింది. దాంతో అభిమానులను ఉద్దేశించి రజత్ పటీదార్ ప్రత్యేకంగా మాట్లాడాడు. జెర్సీపై రెండో స్టార్ కోసం తమ సాయశక్తులా కృషి చేస్తామని అభిమానులకు హామీ ఇచ్చాడు. ‘ఇది సీజన్ మొదటి మ్యాచ్ కాబట్టి వికెట్ ఎలా స్పందిస్తుందో చూడాలి. గత సీజన్ నుంచి మాకు చాలా సానుకూల అంశాలు ఉన్నాయి. మేము దేనినీ కాపాడుకోవాల్సిన అవసరం లేదు. ఐపీఎల్ 2026లో కూడా మేమే విజయం సాధిస్తాం. గాయాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా జట్టులో చాలా మంది మంచి ఆటగాళ్లు ఉన్నారు. అద్భుతమైన బ్యాకప్ ఆప్షన్స్ ఉన్నాయి.ఆటగాళ్లందరూ ఫిట్‌గా ఉన్నారు. గాయపడిన ఆటగాళ్లను మెడికల్ స్టాఫ్ నిరంతరం పర్యవేక్షిస్తుంది. మా ఫ్యాన్స్ చెప్పేది ఒక్కటే.. మాకు మద్దతు ఇస్తున్నందుకు చాలా ధన్యవాదాలు. మేం ఈసారి కూడా టైటిల్ గెలవడానికి ప్రయత్నిస్తాం. జాకోబ్ డఫ్ఫీ, అభినందన్ సింగ్ అరంగేట్రం చేస్తున్నారు.’అని రజత్ పటీదార్ పేర్కొన్నాడు.మరోవైపు టాస్ ఓడినా తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, పిచ్ తాజాగా ఉందని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. ఈ వికెట్‌పై ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా ఫరక్ పడదన్నాడు. తమ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, ప్రతీ ఒక్కరు మంచి టచ్‌లో ఉన్నారని చెప్పాడు. ‘మేం టాస్ గెలిచి ఉంటే ముందుగా బౌలింగ్ ఎంచుకునేవాళ్లం. కానీ వికెట్ తాజాగా కనిపిస్తోంది. కాబట్టి ముందుగా బ్యాటింగ్ చేసినా, బౌలింగ్ చేసినా వచ్చే సమస్య ఏం లేదు. నైపుణ్యాలపై నమ్మకం ఉండాలి. ఇది ఐపీఎల్ కాబట్టి ఏదో కొత్తగా చేయాల్సిన అవసరం లేదు.

# బిగ్‌బాస్ బ్యూటీతో మహమ్మద్ సిరాజ్ డేటింగ్..?



టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్.. బిగ్ బాస్ ఫేమ్ మహిరా శర్మతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరూ ఒకే కాఫీ షాప్‌లో కలిసి కనిపించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ కాఫీ షాప్ నుంచి ఈ ఇద్దరూ విడివిడిగా బయటకు వచ్చినప్పటికీ, ఒకే సమయంలో అక్కడే ఉండటంతో సందేహాలు మొదలయ్యాయి. వీరిద్దరూ కలిసి క్వాలిటీ టైమ్ గడిపారని, ఈ ఇద్దరి మధ్య సంథింగ్ సంథింగ్ నడుస్తుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.అయితే ఈ డేటింగ్ వార్తలపై మహమ్మద్ సిరాజ్, మహిరా శర్మ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగని ఖండించను లేదు. సిరాజ్, మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నారని వార్తలు రావడం ఇదే తొలిసారి కాదు. 2024 చివర్లోనే ఈ ప్రచారం మొదలైంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒకరినొకరు ఫాలో అవ్వడం, ఫొటోలకు లైక్ చేసుకోవడంతో ఈ పుకార్లు మొదలయ్యాయి. గతేడాది ఈ డేటింగ్ వార్తలను సిరాజ్ ఖండించాడు. అవన్నీ అవాస్తవం, నిరాధారమైనవని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పెట్టాడు. ఆ వెంటనే ఆ పోస్ట్‌ను తొలగించాడు. మహిరా కూడా ఈ పుకార్లను ఖండించింది. తాను ఎవరితోనూ డేటింగ్‌లో లేనని, తన కెరీర్‌పై మాత్రమే ఫోకస్ పెట్టానని స్పష్టం చేసింది. కానీ ప్రతీ సెలెబ్రిటీ కపుల్ ఇలానే చెబుతుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో మహమ్మద్ సిరాజ్ గుజరాత్ టైటాన్స్‌కు ఆడుతుండటంతో ఈ డేటింగ్ పుకార్లు మరోసారి తెరపైకి వచ్చాయి. పంజాబ్ కింగ్స్‌తో మరికాసేపట్లో ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌తో గుజరాత్ టైటాన్స్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న సిరాజ్.. ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉన్నాడు. జమ్మూ కశ్మీర్‌లో 1997లో పుట్టిన మహిరా శర్మ.. మోడల్‌గా కెరీర్ ప్రారంభించింది. సీరియల్స్‌తో యాక్టింగ్‌వైపు వచ్చింది. నాగిన్ 3 అనే సీరియల్‌లో ‘చుర్ఫురి’ పాత్రతో గుర్తింపు పొందింది. కుండలి భాగ్య, బేపనా ప్యార్ సీరియల్స్‌తో కూడా ఆమె పాపులారిటీని సొంతం చేసుకుంది. సల్మాన్ ఖాన్ హోస్ట్ చేసిన బిగ్ బాస్ హిందీ సీజన్ 13లో కంటెస్టెంట్‌గా పాల్గొని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ షోలో పరాస్ చాబ్రాతో ఆమె స్నేహం అప్పట్లో పెద్ద హాట్ టాపిక్ అయ్యింది. పంజాబీ ఇండస్ట్రీలో ఆమె ఒక టాప్ మోడల్.ముఖ్యంగా లెహంగా సాంగ్ ఆమెకు భారీ క్రేజ్ తెచ్చిపెట్టింది. ఈ పాట యూట్యూబ్‌లో 100 కోట్లకు పైగా వ్యూస్ సాధించింది. ‘కడే హా కడే నా’, ‘లెంబర్గిన్ని’ వంటి పంజాబీ సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. మహిరా శర్మకు ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రస్తుతానికి ఆమె హిందీ వెబ్ సిరీస్‌లు , పంజాబీ సినిమా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సినిమా
CINEMA




# ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు

’బలగం’ సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ ’ఎల్లమ్మ’తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు.



# 10న విడుదలవుతున్న డెకాయిట్

అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ ’డెకాయిట్’ షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం ’డెకాయిట్’ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. ’ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను’ అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది.



# దురంధర్ -2 నుంచి ’జైయే సజనా’ ఫుల్ వీడియో సాంగ్

బాలీవుడ్ స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ స్పై థ్రిల్లర్ ’ధురంధర్: ది రివెంజ్’ నుంచి ’జైయే సజనా’ ఫుల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. సినిమాలో రెహమాన్ డెకాయిట్ మరణానంతరం వచ్చే ఈ ఎమోషనల్ సాంగ్.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత శాశ్వత్ సచ్‌దేవ్ అద్భుతమైన సంగీతాన్ని అందించగా.. పంజాబీ పాప్ సింగర్ జాస్మిన్ శాండ్లాస్, ప్రముఖ సూఫీ గాయకుడు సతీందర్ సర్తాజ్ కలిసి ఈ పాటను ఎంతో హృద్యంగా ఆలపించారు. ముఖ్యంగా ఈ పాటలో సతీందర్ సర్తాజ్ పాడిన ’సాను సరియాన్ విసర్ గైయాన్ రహ్వాన్, వే కెహ్డే పాసే జైయే సజ్జనా’ అనే పంజాబీ లిరిక్స్ ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# వినూత్న ఆలోచనలతో "రండి... పారిశ్రామికవేత్తలుగా మారండి

## ఏప్రియల్ 11 న నల్గొండ ఐ టి టవర్స్ లో ఇన్నోవేషన్ పంచాయతీ

## పోస్టర్ ను ఆవిష్కరన సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



ఈనెల 11న నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్స్ లో తెలంగాణ ఇన్నోవేషన్స్ ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ పంచాయత్" ను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఇన్నోవేషన్ పంచాయత్ పై రూపొందించిన గోడ పత్రికను సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నల్గొండ, సూర్యాపేట అలాగే యాదాద్రి జిల్లాల నుండి ఆవిష్కర్తలను, వ్యవస్థాపకులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఆవిష్కర్తలకు, వారికి అవసరమైన తోడ్పాటుకు మధ్య ఉన్న భౌగోళిక దూరాన్ని తగ్గించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన వేదికగా ఇన్నోవేషన్ పంచాయత్ ను రూపొందించారాని, యువత తమ ఆలోచన, ఆవిష్కరణ అలాగే పారిశ్రామిక ప్రయాణం గురించి సందేహాలుంటే ఈ వేదిక ద్వారా రాష్ట్రంలోని వ్యవస్థాపక నిపుణుల నుండి వ్యక్తిగత, మార్గదర్శకత్వం పై సలహాలు పొందేందుకు ఇది ఒక గొప్ప అవకాశంగా భావించి ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర రాజధాని వెలుపల ఉన్న వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలకు వనరులు సమానంగా అందుబాటులో ఉండేలా, తక్షణ మరియు స్పష్టమైన సహాయాన్ని అందించడానికి ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దారని ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు, నిపుణులతో నేరుగా చర్చించవచ్చని వ్యాపారం లేదా సాంకేతిక సవాళ్లను అక్కడికక్కడే పరిష్కరించడానికి మార్గదర్శకత్వం, ఆలోచన ధ్రువీకరణ,నమూనా అభివృద్ధి, వ్యాపారాన్ని విస్తరించే ప్రక్రియపై సలహాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ఇంక్యుబేషన్ సహాయాన్ని నేరుగా పొందడానికి కనెక్షన్లను సులభతరం చేసి అవకాశం ఉంటుందని కలెక్టర్ అన్నారు. అంకురాలకు మద్దతుగా, సమ్మిళిత వాతావరణాన్ని నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం బలపరుస్తుందని, ఈ జిల్లాల నుండి ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులు, ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎఫ్ఓ రాజశేఖర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవోలు రమణారెడ్డి శ్రీదేవి, ఈడియం దుర్గారావు,టి జి ఐ సి కో ఆర్డినేటర్లు అనూష,ఫరీన తదితరులు ఉన్నారు.

# వైభవంగా శ్రీ బాల వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో వెలసిన శ్రీ బాల వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు..చిట్యాల పట్టణంలో కొలువైన బాల వెంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవాలు కనులపండువగా నిర్వహించబడ్డాయి. స్వామి వారి కళ్యాణ కార్యక్రమానికి తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ పర్యవేక్షకులుగా వ్యవహరించి కళ్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు.? ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం బ్రాహ్మీ ముహూర్తం నుంచే ఆలయంలో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణార్థం స్వామివారికి శాంతికల్యాణం, ప్రత్యేక హోమాలు నిర్వహించార. కళ్యాణ వేడుక అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.?ఈ వేడుకను వీక్షించేందుకు చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం గోవింద నామస్మరణతో మారుమోగింది.

# పుట్టపాక గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ



చౌటుప్పల్,(అక్షర కలం):

సంస్థాన్ నారాయణపురం మండలం మునుగోడు స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో పుట్టపాక గ్రామంలో ఎస్టి,ఎస్సి సబ్ ప్లాన్ కింద 10 లక్షల రూపాయలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొరకు నిధులు మంజూరు అయ్యాయి. పుట్టపాక గ్రామ సర్పంచ్ గజం అనిత సత్యనారాయణ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు,ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు,గ్రామ నాయకులు, కార్యకర్తలు,మహిళలు,గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# రబీ ధాన్యం సేకరణ షురూ

## రైతులకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్

## సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులా.. 9963407064 నెంబర్‌కు ఫోన్ చేయండి

## 24 గంటల పాటు రైతు సేవలకే కంట్రోల్ రూమ్ ఏర్పాటు కలెక్టర్

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం






2025 – 26 రబీ ధాన్యం సేకరణ ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లోని ఫోన్ నెంబర్ 9963407064 నెంబర్ కు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో రబీ ధాన్యం కొనుగోలుపై ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రబీలో రైతులు పండించిన ధాన్యానికి క్వింటాలకు గ్రేడ్ "ఏ" రకానికి 2389 రూపాయలు, సాధారణ రకానికి 2369 రూపాయల కనీసం మద్దతు ధరను ప్రకటించిందని, ఇదే కాకుండా సన్నధాన్యానికి ప్రోత్సాహంగా క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, దాన్యంలో ఎలాంటి తాలు,తరుగు, తేమ వంటివి లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలతో పాటు, టార్పాలిన్లు, అన్ని రకాల సదుపాయాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ధాన్యం అమ్మకంలో సమస్యలుంటే పైన పేర్కొన్న కంట్రోల్ రూమ్ కు ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని ఆయన రైతులకు సూచించారు. ఫిర్యాదుల విభాగానికి వచ్చే ఫోన్ నెంబర్లు అన్నింటిని రికార్డు రూపంలో నమోదు చేయాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే వెంటనే అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని, కంట్రోల్ రూమ్ లో 24 గంటలు విధులు నిర్వహించే విధంగా సిబ్బందికి విధులు కేటాయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ రాంపతి తదితరులు ఉన్నారు.

# బిటి రణదివె పోరాట స్ఫూర్తితోనే కార్మిక హక్కుల పరిరక్షణ

## సిఐటియు జిల్లా కార్యాలయంలో బీటీఆర్ 36వ వర్ధంతి వేడుకలు

## ఘనంగా నివాళులర్పించిన నేతలు తుమ్మల వీరారెడ్డి, ఎండి. సలీం

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

ఐక్యత పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియుకు వ్యవస్థాపక అధ్యక్షులుగా కామ్రేడ్ బీటీ రణ దేవి పోరాట స్ఫూర్తి ఎంతో ఆదర్శనీయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి జిల్లా కార్యదర్శి ఎండి. సలీం అన్నారు.సోమవారం సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బీటీ రణదీవే 36వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యాలయంలో మరియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరానగర్ లో పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రజులు కామ్రేడ్ బి.టి రణదివె (బాలచంద్ర త్రయంబక రణదివె) అసామాన్య పోరాట యోధుడైన సీపీఐ(ఎం) అగ్రనేత ఆయన. 1904 డిసెంబర్ 19న మహారాష్ట్ర లోని బొంబాయి లో జన్మించిన బి.టి రణదివె బ్రిటిష్‌కు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. బ్రిటిష్ కాలంలోనే బొంబాయిలో కార్మిక సంఘాలు స్థాపించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలియజేశారు. 1970లో ఏర్పడిన నాటి నుండి 1991 వరకు సెంటర్ ఆఫ్ ఇండియన ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. కార్మికుల ప్రయోజనాలే తప్ప సొంత జీవితం పట్ల ఆసక్తి లేని నిస్వార్థ నేత బి.టి.ఆర్. తన తండ్రి అంత్యక్రియలకు కూడా వెళ్లకుండా కార్మిక పోరాటంలో ఉన్న తీరు కార్మికవర్గానికి ఆయన ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనమని కార్మిక వర్గానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని ప్రసంగించారు. నేడు బిటిఆర్ మన మధ్య లేకపోయినా ఆయన వదిలి వెళ్ళిన ఆశయాలు ఇంకా అలానే ఉన్నాయి. ఆనాడు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులు నేటి పాలకుల విధానాల వల్ల కాలరాయబడుతున్నాయి. ప్రజలపై మరిన్ని భారాలు పెరుగుతున్నాయి. ఒకపక్క కార్పొరేట్ల ఆస్తులు ఇబ్బడి ముబ్బడిగా పోగుబడుతుంటే, మరోపక్క ఆకలి, పేదరికం, ఆకలి చావులు, రైతాంగ ఆత్మహత్యలు, నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ఐక్య కార్మికోద్యమాన్ని నిర్మించడమే బిటిఆర్‌కి మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, సహాయ కార్యదర్శి అవుట రవీందర్ లు మాట్లాడుతూ ఏప్రిల్ 6 బి టి ఆర్ వర్ధంతి నుండి ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సామాజిక న్యాయం సాధన క్యాంపెయిన్ నిర్వహించాలనే పిలుపులో భాగంగా విమల రణదేవి, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుల జయంతి ,వర్ధంతి లు నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. అందులో భాగంగా ఏప్రిల్ 10న సామాజిక న్యాయం సిఐటియు అవగాహన అనే అంశంపై సెమినార్ నిర్వహించడం జరుగుతుంది తెలిపారు. స్వాతంత్రం 80 సంవత్సరాలు వీటికి దళితులు గిరిజనులపై వివక్ష తొలగిపోలేదని విద్యావంతుల సంఖ్య పెరిగిన వివక్ష రూపం మారింది తప్ప అంటరానితనం పోలేదని అన్నారు. వివక్షతలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సామాజిక న్యాయం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు లకపాక రాజు, బిఎస్ఎన్ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాణాల పరిపూర్ణాచారి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గంజి రాజేష్, తెలంగాణ మిషన్ భగీరథ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కుద్తల సైదులు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, వెంబడి వెంకన్న,వనపర్తి సోములు, మధుసూదన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# యువత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

ఇడం రాధా శ్రీనివాసులు

గ్రంథాలయానికి భారత రాజ్యాంగ ప్రతుల అందజేత

10 వేల పుస్తకాల ముద్రణ.. ఇప్పటికే 5 వేల ప్రతుల పంపిణీ





అక్షరకలం దేవరకొండ

భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి, అందులోని చట్టాలను, హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇడం స్వరూప స్మారక సేవా సంస్థ వ్యవస్థాపకులు, వెల్లంకి సర్పంచ్ ఇడం రాధా శ్రీనివాసులు అన్నారు. సోమవారం దేవరకొండలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు, పాఠకులకు ఆయన తెలుగులో ముద్రించిన రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత గొప్ప గ్రంథమని, దానిని నేటి యువత సమగ్రంగా చదివి అర్థం చేసుకోవాలన్నదే తన సంకల్పమని తెలిపారు. తన భార్య సర్పంచిగా గెలుపొందిన వెంటనే ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని వివరించారు. మొత్తం 10,000 రాజ్యాంగ పుస్తకాలను తెలుగులో ముద్రించామని, ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 5,000 పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశామని వెల్లడించారు. గ్రంథాలయానికి సైతం ప్రత్యేకంగా పుస్తకాలను అందజేస్తూ, అభ్యర్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇడం రాములు, చిలివేరు కాశీనాథ్, సిరందాసు వెంకటేశ్వర్లు, లైబ్రరీ అసిస్టెంట్ శారద మరియు పెద్ద సంఖ్యలో పాఠకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# అనాథ యువతి వివాహానికి లోచన్ సింగ్ నాయక్ ఆర్థిక సాయం

అక్షరకలం దేవరకొండ



పేదరికంలో ఉన్న అనాథ యువతి వివాహానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నేనావత్ లోచన్ సింగ్ నాయక్ అండగా నిలిచి తన ఉదారతను చాటుకున్నారు. దేవరకొండ మండలం పర్శతండ గ్రామానికి చెందిన దివంగత నేనావత్ రవి - చిట్టీల కుమార్తె సోని తల్లిదండ్రులు లేక, వివాహం జరిపించడం ఆర్థికంగా కష్టతరంగా మారిన విషయాన్ని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన లోచన్ సింగ్ నాయక్ మానవత్వంతో ముందుకు వచ్చి, యువతి వివాహం నిమిత్తం ?20,000/- నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆడపిల్లల పెళ్లిళ్లు ఆగిపోవడం బాధాకరమని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం తన సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఆపన్న హస్తం అందించిన లోచన్ సింగ్ నాయక్ సేవానిరతిని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఫీజుల వసూలుపై కోర్టు తీర్పు పేద విద్యార్థులకు గొడ్డలి పెట్టు: డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్

అక్షరకలం దేవరకొండ

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేయవచ్చని హైకోర్టు తీర్పునివ్వడం 14 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం దేవరకొండలో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో ప్రభుత్వం తరపున అడ్వకేట్లు సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం పైకోర్టులో అప్పీలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6,500 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య గారి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, నట్వ సుధాకర్, కాటం వెంకటేష్ గౌడ్, శివ, మాలిక్ పాల్గొన్నారు.



# ధాన్యం సేకరణపై ప్రత్యేక నజర్

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజావాణిలో 113 దరఖాస్తుల స్వీకరణ.. ఈ ఆఫీస్ నిర్వహణపై అధికారులకు ఆదేశాలు

ప్రభుత్వ కార్యాలయాల్లో యుద్ధ ప్రాతిపదికన 'టీ- ఫైబర్' కనెక్షన్లు

అంబేద్కర్ జయంతి వేడుకలకు సిద్ధం కావాలని ఆదేశం

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం







రబీ ధాన్యం సేకరణ ప్రారంభమైనందున మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలలో యుద్ధ ప్రాతిపదికన టి- ఫైబర్ నెట్ వర్క్ ఏర్పాటు చేయడం పూర్తిచేయాలని అన్నారు. ఈ నెల 10న ఆయా శాఖలలో ఇంజనీరింగ్ అధికారుల ద్వారా చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, అందువల్ల సంబంధిత శాఖల అధికారులు వారి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఈనెల 14న నిర్వహించే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అవగాహన కల్పించేందుకుగాను విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని, అలాగే వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకాలపై ఈ వారంలో సోషల్ ఆడిట్ నిర్వహించాలని జెడ్పి సిఈ ఓ ప్రేమ్ కరణ్ రెడ్డిని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ఫైళ్ళ నిర్వహణను ఈ- ఆఫీస్ ద్వారానే చేయాలని, ఇందుకు సంబంధించి తక్షణమే డిజిటల్ కీ తీసుకోవాలని, ప్రతి కార్యాలయ అధికారి ఫైల్ నిర్వహణకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు యూనిఫార్మ్ రానున్నందున మహిళా సంఘాలు, సెట్విన్ వంటి సంస్థల ద్వారా యూనిఫార్మ్ కుట్టించేందుకు సంసిద్ధంగా కావాలని మెప్మా పిడిని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు సంబంధించిన కేసుల నివేదికలను తక్షణమే సమర్పించాలని అన్నారు. రబీ ధాన్యం కొనుగోలు ప్రారంభమైనందున నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలకు అవసరమైన సామాగ్రి ముందే పంపిణీ చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, "ఓ ఆర్ ఎస్" పాకెట్లు ఉంచాలని, ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 61, ఇతర శాఖలకు 52 మొత్తం 113 ఫిర్యాదులు వచ్చాయి. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డీఎఫ్ఓ రాజశేఖర్, దేవరకొండ, చండూర్ ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

# ఈట్ రైట్..." స్టే హెల్తీ"

నల్లగొండలో ఘనంగా ఆహార భద్రత అవగాహన నడక

కల్తీ రహిత ఆహారమే ఆరోగ్యానికి ఆధారం

జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

వీధి వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ లైసెన్సుల పంపిణీ... ప్రచార వాహనం ప్రారంభం

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 11 వరకు 'ఆరోగ్య వారోత్సవాలు'

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం






ఆహార భద్రత లో భాగంగా ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలు సమయంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజలలో అవగాహన కల్పించే నిమిత్తం సోమవారం జిల్లా ఆహార భద్రత నియంత్రణ శాఖ ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వరకు "ఈట్ రైట్ స్టే హెల్తీ" పేరున నిర్వహించిన నడక ను క్లాక్ టవర్ వద్ద జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దైనందిన జీవితంలో ఆహారంతో పాటు, వ్యాయామం చాలా అవసరమని, అలాగే ప్రజలు కల్తీ ఆహారం బారినపడకుండా ఆహార పదార్థాలు కొనే ముందు జాగ్రత్తగా చూసి కొనుగోలు చేయాలని, నాణ్యతను, ఎక్స్పైరీ డేట్ ను చూడాలని, ఎక్కడైనా ఆహార వస్తువులు కల్తీ అయినట్లయితే తక్షణమే ఫిర్యాదు చేస్తే వెంటనే ఆహారభద్రత అధికారులకు ఫోన్ చేస్తే ఆహార భద్రత అధికారులు దాడులు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రజల ఆరోగ్య సంరక్షణకై నల్గొండ పట్టణంలో సుమారు 100 మంది వీధి వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ శాఖ తరఫున లైసెన్సులు మంజూరు చేసినట్లు ఆయన తెలియజేయడమే కాకుండా వీధి వ్యాపారులకు లైసెన్స్ లు అందజేశారు. ఆహారం కల్తీ కావడం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే అవకాశం ఉందని, అందువల్ల ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని కల్తీ లేకుండా ఆహార పదార్థాలు అమ్మాల్సిన అవసరం ఉందని వ్యాపారులకు సూచించారు. ప్రజలు, వ్యాపారులు అందరికీ అవగాహన కల్పించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 6 నుండి 11 వరకు "ఆరోగ్య వారోత్సవం" నిర్వహిస్తున్నదని, అందులో భాగంగానే "ఈట్ రైట్ స్టే హెల్తీ" నడక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, అలాగే ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ప్రచార వాహనాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రచార వాహనం పది రోజులపాటు, జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రజలలో కల్తీ ఆహార వస్తువుల వల్ల జరిగే ప్రమాదాలు, కల్తీ ఆహార పదార్థాలు కొనకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల పై వివరిస్తుందని తెలిపారు. ఆహార భద్రత జోనల్ అధికారి జ్యోతిర్మయి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివ శంకర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రధాన ఆసుపత్రి సూపరింటిండెంట్ నరసింహారావు నేత, డాక్టర్లు, తదితరులు ఈ నడక కార్యక్రమంలో పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ: ప్రయాణికుడికి చేరిన లక్షల విలువైన ల్యాప్‌టాప్

## బస్సులో మర్చిపోయిన బ్యాగును భద్రపరిచి అప్పగించిన సిబ్బంది

### అభినందించిన డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు



అక్షరకలం దేవరకొండ

దేవరకొండ ఆర్టీసీ డిపో ఉద్యోగులు తమ విధుల పట్ల అంకితభావాన్ని, నిజాయితీని చాటుకొని ప్రయాణికుల ప్రశంసలు అందుకున్నారు. బస్సులో మర్చిపోయిన విలువైన ల్యాప్‌టాప్‌ను క్షేమంగా బాధితుడికి అందజేసి మానవత్వాన్ని చాటారు.

**వివరాల్లోకి వెళ్తే..**

దేవరకొండ డిపోకు చెందిన నడిగడ్డ మ్యారేజ్ స్పెషల్ బస్సు సోమవారం ప్రయాణికులతో బయలుదేరింది. ఆ బస్సులో ప్రయాణించిన ఒక వ్యక్తి తన గమ్యస్థానమైన నడిగడ్డ వద్ద దిగిపోతూ, సుమారు ?50,000 విలువైన ల్యాప్‌టాప్ కలిగిన బ్యాగును సీటులోనే మర్చిపోయాడు. బస్సు డ్రైవర్ బి. యాదయ్య (ఈ.నెం. 176102) బస్సును తనిఖీ చేస్తుండగా ఆ బ్యాగును గమనించారు. వెంటనే దానిని భద్రపరిచి డిపో అధికారులకు సమాచారం అందించారు. అనంతరం డిపో అధికారులు బాధితుడి వివరాలను సేకరించి, అతడిని దేవరకొండ డిపోకు పిలిపించారు. సరైన ఆధారాలను పరిశీలించిన తర్వాత, డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు చేతుల మీదుగా సదరు ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ బ్యాగును అందజేశారు. తన విలువైన వస్తువును తిరిగి పొందిన ప్రయాణికుడు ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిజాయితీ చాటిన డ్రైవర్ యాదయ్యను అసిస్టెంట్ మేనేజర్ మరియు తోటి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# పెనుయేలు సంస్థ సామాజిక కార్యక్రమాలు అభినందనీయం

### మున్సిపల్ చైర్ పర్సన్ యెర్నేని కుసుమ వెంకటరత్నం బాబు



అక్షరకలం కోదాడ

నియోజకవర్గంలోనే అతి పెద్ద క్రైస్తవ సంస్థ పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ వారు చేస్తున్న సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని కోదాడ మున్సిపల్ ఛైర్ పర్సన్ యెర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. కోదాడలోని పురమ రంగారావు ఫంక్షన్ హాల్ లో ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లకు ఆత్మీయ సన్మాన సభలో పాల్గొని మాట్లాడారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పెనుయేలు సంస్థ వారు నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, మునిసిపల్ కౌన్సిలర్ లను పెనుయేలు సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం. రాజేష్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అందరికీ ఈస్టర్ పండుగ యొక్క విశిష్టతను తెలియజేస్తూ ఎం. రాజేష్ వారిని ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. ఈస్టర్ పండుగ యొక్క గొప్పతనాన్ని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెనుయేలు సంస్థ వ్యవస్థాపకులు ఆర్చి బిషప్ జె. సుదర్శనం, అధ్యక్షులు బిషప్ జె జె సామ్యూల్ సన్, కోదాడ పట్టణానికి చెందిన బిషప్ డా కె జోసెఫ్, బిషప్ సీ.హెచ్. లూకా కుమార్, బిషప్ జి.ఆర్. అబ్రహాం, ఎం. రాముజెకర్యా, జె. దానియేలు, పెనుయేలు సంస్థలోని పాస్టర్లు, క్రైస్తవులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధి బిజెపి తోనే సాధ్యం

### చిట్యాల లో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం.



అక్షర కలం చిట్యాల

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని చిట్యాల పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్ అన్నారు సోమవారం చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బిజెపి జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక అభివృద్ధి నరేంద్ర మోడీ తోనే సాధ్యమైందని పేర్కొన్నారు. మోడీ నాయకత్వంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సజావుగా అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో చంచు శ్రీను, మాస శ్రీను, ఈడుదుల మల్లేష్, కంబాలపల్లి సతీష్, కూరల శ్రీనివాస్, అశోక్, మహాలింగం, పల్లె వెంకన్న, మల్లారెడ్డి, దొడ్డ భాగ్యమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

అక్షరకలం, చందూరు

చందూరు మున్సిపల్ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలని బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు భూతరాజు శ్రీహరి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ దగ్గర, స్థానిక మెయిన్ సెంటర్ లో మరియు లకినేనిగూడం లో పార్టీ జెండాలను బూత్ అధ్యక్షుల చేతుల మీదుగా ఎగురవేశారు. నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ జీ ఆశయసాధన కోసం వాజపేయ్ అద్వానీ ల స్ఫూర్తి తో మోదీ జీ నాయకత్వంలో పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా బిజెపి పనిచేస్తుందని, రాష్ట్రంలో కూడా భారతీయ జనతా పార్టీ రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధ పాలనలో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఇలా అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని, ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలను అమలుచేయడంలో విఫలమైన ఈ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు. భారతీయ జనతా పార్టీ



అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని ప్రజాక్షేత్రంలోనే ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు అన్నెపర్తి యాదగిరి, బోడ ఆంజనేయులు, తడకమళ్ళ శ్రీధర్, ఇరిగి ఆంజనేయులు, పేర్ల గణేష్, సామ వెంకట్ రెడ్డి, మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమ శంకర్, భూతరాజు స్వామి, బొబ్బల శివకుమార్, గండు శ్రీకాంత్, తోకల రవీందర్, చెనగాని శేఖర్, కారింగు శంకరయ్య, పల్లెగోని చంద్రమౌళి, సంగెపు నరేష్, పగిళ్ళ చంద్రశేఖర్, గొల్లూరి వెంకన్న, గణేష్, కైలాసం, చొప్పరి సత్తయ్య, కారింగు రాజు, సామ సత్యనారాయణ, బలుసుల వెంకన్న, పెద్ద సంఖ్యలో మహిళలు, బిజెపి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి బీజేపీనే శ్రీరామరక్ష

### ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం



అక్షరకలం కోదాడ

భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోదాడ మండల పరిధిలోని నల్లబండ గూడెం గ్రామంలో మండల అధ్యక్షులు గాదరి పుల్లారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బోలిశెట్టి కృష్ణయ్యలు హాజరై జండా ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకొని పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పాలనలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మోడీ పాలనలో భారతదేశం ప్రపంచంతో పోటీపడి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని దేశానికి బిజెపి పార్టీ శ్రీరామరక్ష అని అన్నారు. బిజెపితోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓరుగంటి పురుషోత్తం , ఎరగని రాధాకృష్ణ , కటగోజు నాగేంద్ర చారి , మండల సీనియర్ నాయకులు భూమా శ్రీనివాస్ , మండల ఉపాధ్యక్షుడు పూర్ణయ్య, మండల కోశాధికారి బైతు శ్రీరాం మూర్తి, గుండెపంగు సైదులు,బూత్ అధ్యక్షులు మల్లయ్య, బంగారయ్య, శీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య మిత్రునికి కుటుంబానికి ఆర్థిక సహాయం



అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన మును గోటి వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం అతని తోపాటు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న 2006-07 పూర్వ విద్యార్థులు ఒక లక్ష 23 వేల రూపాయలను పోస్ట్ ఆఫీస్ లో మృతుడు వెంకన్న కూతురు రేణుక పేరు మీద ప్రధానమంత్రి సుకన్య యోజన పథకం కింద డిపాజిట్ చేసి వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల నరేష్, దమ్మాల నరేందర్ రెడ్డి, చిన్నపాక నాగరాజు, జిట్ట శేఖర్, కూరాకుల యాదగిరి పాల్గొన్నారు.

# ఈ నెలాఖరులోగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలి

### మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

అక్షరకలం నల్గొండ

మిర్యాలగూడ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ లు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల పనుల పురోగతిని సమీక్షించారు. పరిశీలన సందర్భంగా మిగిలి ఉన్న అన్ని పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయం, ప్లంబింగ్ పనులు, టాయిలెట్లు, కిచెన్ ఏర్పాట్లు, రోడ్లు మరియు డ్రైనేజ్ వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఇళ్లన్నీ పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. లబ్ధిదారులకు నాణ్యమైన వసతులు కల్పించడంలో ఎటువంటి రాజీ ఉండదని తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా గృహ నిర్మాణం పిడి రాజ్ కుమార్, తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్,ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి,కలెక్టర్ వెంట ఉన్నారు.




# యాదాద్రిలో భరోసా సెంటర్ ను ప్రారంభించిన డిజీపి

యాదాద్రి భువనగిరి అక్షర కలం



యాదాద్రి భువనగిరి జిల్లాలోని మహిళలకు, పిల్లలకు భరోసా సెంటర్ భద్రతను ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ లతో కలిసి రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి , అడిషనల్ డీజీపీ (లా ఢ ఆర్డర్) మహేష్ ఎం. భగవత్ భరోసా సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం డి.జి.పి జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పోలీస్ శాఖకు ప్రస్తుతం సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో పోలీస్ అధికారులు ముందుండాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులకు ఇబ్బంది లేకుండా మద్దతు ధర ఇవ్వాలి -జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్

అక్షరకలం నల్గొండ

జిల్లాలో రైతులు అమ్మే ధాన్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రైస్ మిల్లు ఓనర్లను ఆదేశించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని మహా తేజ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గన్ని బ్యాగుల నిల్వ గదులను బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే దిగుమతి చేసుకుని, కొనుగోలు చేయాలని మిల్లర్లకు చెప్పారు. రైతులను ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్లు అందరూ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కోరారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు నుండి మూడు రైస్ మిల్లులను అనుసంధానం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ సీజన్ ముగిసే వరకు మిల్లర్లు కలిసికట్టుగా పనిచేసి, ధాన్యం కొనుగోలు వ్యవస్థను సమర్ధవంతంగా అమలు చేయాలని చెప్పారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ఎటువంటి రాజీ ఉండదని ఆయన తెలిపారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డిఎం రామ్ పతి నాయక్, రైస్ మిల్లర్స్ బండారు కుశలయ్య, గౌరు శ్రీనివాస్ శ్రీరామ్, బాబి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





# ఆదరించు సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



మందమర్రి, ఏప్రిల్ 06 అక్షర కలం ప్రతినిధి:

పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానం సమీపంలో సోమవారం ఈస్టర్ పండుగ సందర్భంగా పాస్టర్ వరద రాబర్ట్ సహకారంతో ఆదరించు సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాంపాటి మురళి మాట్లాడుతూ, వేసవి కాలం నేపథ్యంలో బాటసారులు, ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన ప్రజలకు ఇబ్బంది లేకుండా, వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ప్రజలందరూ వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఎండల్లో ఎక్కువ తరగవద్దని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గొర్లపల్లి దుర్గయ్య, సీపతి రమేష్, శేఖర్, బుంగ ప్రకాష్, దేవాజీ, అరుణపాల్, రమేష్, దుర్గం శ్యాందేవ్, సురేష్ లు పాల్గొన్నారు.

# మాయమాటలతో బాలిక అపహరణ....

- నిందితుడికి 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష....

- రూ. లక్ష జరిమానా విధించిన పోక్సో కోర్టు....

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు...

మెదక్ /కొల్చారం ఏప్రిల్06(అక్షర కలం):-




మాయమాటలు చెప్పి బాలికను అపహరించిన కేసులో నిందితుడికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా కోర్టు విధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే 2020 ఆగస్టులో నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పదో తరగతి చదువుతున్న బాలికను లక్ష్మణ్ (20)అనే వ్యక్తి మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు అప్పటి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి కోర్టులో దాఖలు చేశారు.తదుపరి విచారణలో ప్రస్తుత ఐఓ ఎస్ఐ రంజిత్ రెడ్డి సాక్షులను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య తన వాదనలు సమర్థవంతంగా వినిపించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు. భరోసా లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేతా బాధితురాలికి మానసిక ధైర్యం కల్పిస్తూ, విచారణ సమయంలో బాధితురాలికి, సాక్షులకు పూర్తి న్యాయసహాయం అందించారు.కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఆర్.ఎం. సుభావళి నిందితుడికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు విచారణలో కోర్ట్ లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ హరిబాబు తదితరులు కీలకంగా సహకరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# హామీలను అమలు చేసిన ఘనత మాది

## పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం

## మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క

ఆదిలాబాద్,

అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.



# ఇల్లందు సింగరేణి పూసపల్లి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగినాడే ఖాళీ చేస్తాం.- నిర్వాసితులపక్ష కమిటీ సభ్యులు.

అక్షర కలం / ఇల్లందు.

భద్రాద్రి కొత్తగూడం జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో జరిగిన గ్రీన్ వెన్స్ డే లో విజయలక్ష్మి నగర్ తిలక్ నగర్ సర్పంచులు చాందావత్ రమేష్ బాబు, ధనసరి స్రవంతి ఆధ్వర్యంలో 21 అఖిలపక్ష కమిటీ నాయకులు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కలిసి ఇల్లందు సింగరేణి ప్రభావిత ప్రాంతమైన పూసపల్లి నిర్వాసితులకు న్యాయం జరిగితేనే ఇండ్లను ఖాళీ చేస్తామని పూసపల్లి నిర్వాసితుల అఖిలపక్ష కమిటీ నేతలు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రీవెన్స్ డే లో జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ను కలిసి ఇల్లందు పూసపల్లి నిర్వాసితుల కమిటీ నేతలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
మా ముత్తాతలు, తాతలు , తండ్రులు సింగరేణి కి సేవలందించి రిటైర్డ్ ఇక్కడే నివాసం ఉంటున్న మమ్మల్ని ఈరోజు తక్షణమే ఖాళీ చేయాలని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా వెంటనే ఖాళీ చేయాలని సింగరేణి యాజమాన్యం తమపై ఒత్తిడి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తుందని తక్షణమే ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని వారు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కోరారు మండలంలోని విజయలక్ష్మి నగర్, తిలక్ నగర్

గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, అఖిలపక్ష కమిటీ నాయకులు ఇల్లందు సింగరేణి పూసపల్లి ప్రాజెక్టు ఓసీ విషయం పై జాయింట్ కలెక్టర్ కు వివరిస్తూ దాదాపు 130 ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నామని ఇక్కడున్న ప్రజలందరూ మాజీ కార్మికుల కుటుంబ సభ్యులే ఆనాడు సింగరేణి కి సేవలు అందించి,ఎటు వెళ్లలేని పరిస్థితిలో ఇక్కడే



నివాసముండిపోయారని, దాదాపు 20, 30 సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలను సింగరేణి యాజమాన్యం ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యానికి గురి చేసిందన్నారు. పూసపల్లి ఓసి ప్రాజెక్టు కోసమని మా స్థలం మాకు కావాలని దౌర్జన్యానికి పాల్పడుతుందన్నారు. జెకె 5 ఓ సి కొనసాగింపులో భాగంగా 21 ఫిట్ ఏరియా నిర్వాసిత ప్రాంతాలను( విజయలక్ష్మి నగర్ మరియు ఇతర ) ఉన్నపలంగా ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు లేకుండా, సమాచారం లేకుండా ఖాళీ చేయమని సింగరేణి అధికారులు ఇంటింటికి తిరుగుతూ చెబుతున్నారని, దీనికి సంబంధించి గతంలోని చట్ట ప్రకారం మాకు రావలిసినవి ఇవ్వాలని అఖిలపక్షం తరపున వినతి పత్రం అందజేశామని, నిర్వాసితులకు రావాల్సిన కాంపెన్సేషన్ వచ్చిన తర్వాతనే ఇండ్లను ఖాళీ చేస్తామని స్పష్టంగా సింగరేణి యాజమాన్యానికి తెలియజేయడం జరిగిందన్నారు. సింగరేణి వారు అఖిలపక్ష కమిటీ దగ్గరకు వచ్చి సహకరించాలని కోరినప్పుడు అప్పుడు మేము ప్రాజెక్టు స్వాగతిస్తూనే ప్రజలకు న్యాయం చేయాలని చెప్పినామని, కొన్ని డిమాండ్లను వారు అంగీకరించి మా సహకారంతో సర్వే మొత్తం పూర్తి చేసుకొని ఈరోజు ఆ మాటలను తుంగలో తొక్కి వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జెకె 5 ఓసీ లో ఏదైతే నిర్వాసితులకు ఇచ్చిన విధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని, జెకె 5 ఉపరితలం గని కొనసాగింపులో నిర్వాసితులకు ఉన్న ప్రతి కుటుంబానికి, కుటుంబంలోని ప్రతి వ్యక్తికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని, ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇచ్చిన విధంగా అన్ని సదుపాయాలని సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయాలని, నూతన ఇండ్లు కట్టే వరకు నిర్వహస్థితులకు అకామిడేషన్ ఇప్పించాలని రెండు గ్రామ గ్రామపంచాయతీలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని, గ్రామపంచాయతీలో నివాసం ఉంటున్న సొంతిల్లు కట్టుకున్న ప్రజలకు రెవెన్యూ కు అప్పగించి పట్టాలు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి కోటర్స్ ను నివాసముంటున్న ప్రజలకు అప్పజెప్పి, సింగరేణి కరెంటు తీసి ప్రభుత్వ కరెంటు ఇచ్చే విధంగా సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ కి వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పూర్తి వివరాలతో రావాలని సింగరేణి వారికి లెటర్ పంపిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాండ్ర నాగరాజు, ఎట్టి హరికృష్ణ, వడ్రల శ్రీను, క్లింట్ రోచ్, తేజవత్ లాలు,సదారం చిన్నారి, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06:





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. సోమవారం జిల్లాలోని కోటపల్లి మండలంలోని కోటపల్లి, మల్లంపేట, వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామపంచాయతీలలో కొనసాగుతున్న పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, త్రాగునీటి సరఫరా, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకునేలా వివరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని, నిర్మాణ దశకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా అందిస్తున్న ఇసుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలలో వరి వంగడాలను తయారు చేయడానికి పాటించే పద్ధతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నీల్వాయి గ్రామపంచాయతీ కార్యాలయం నూతన భవనం, గ్రామంలో కంపోస్ట్ షెడ్ లో తయారు అవుతున్న ఎరువును పరిశీలించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, ఆహారం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి, మండల పంచాయతీ అధికారి వెంకటేష్, పంచాయతీరాజ్ ఎఈ ప్రదీప్, గృహ నిర్మాణ శాఖ ఎఈ కార్తీక్, పంచాయితీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# షీ టీమ్ తో మహిళలు, విద్యార్థినులకు భద్రత, భరోసా

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06:



మహిళలు, విద్యార్థినులకు భద్రత, భరోసా కల్పించడం కోసమే షీ టీం పనిచేస్తుందని జిల్లాలోని చెన్నూరు సిఐ బన్సీలాల్, జిల్లా షీ టీం ఎస్ఐ లు హైమ, ఉషారాణి లు తెలిపారు. సోమవారం జిల్లాలోని చెన్నూరులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో చెన్నూరు సిఐ బన్సీలాల్, జిల్లా షీ టీం ఎస్ఐ హైమ, ఉషారాణి ల ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేక కౌన్సిలింగ్, షీ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బన్సీలాల్, షీ టీం ఎస్ఐ లు మాట్లాడుతూ, చెన్నూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఒక విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగి మృతి చెందడం, మరో ఎనిమిదో తరగతి విద్యార్థిని హాస్టల్ లో ఆత్మహత్యాయత్నం చేయడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకొని, విద్యార్థినుల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్, షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం లేదా ఏదైనా విషయంలో ఓడిపోవడం జీవితాంతం ప్రభావం చూపించదని, అది నేర్చుకునే ప్రక్రియ మాత్రమేనని వివరించారు. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొని, ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థినులకు యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాల తో ఒత్తిడిని ఎలా తగ్గించుకోవచ్చో వివరించారు. తమ సమస్యలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన స్నేహితులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. షీ టీమ్ సేవలు, వాటి ఉద్దేశాన్ని వివరించి, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385లను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా లలో గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆన్ లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన క్యాతనపల్లి మున్సిపల్ పాలకవర్గం

## చైర్ పర్సన్ గా గొడిసెల సంధ్యారాణి (బిఆర్ఎస్)...వైస్ చైర్ పర్సన్ గా మిట్టపల్లి సరిత (సిపిఐ) లు బాధ్యతలు స్వీకరణ

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 06:

తీవ్ర నాటకీయ పరిణాల అనంతరం సుమారు 55 రోజుల తర్వాత ఎట్టకేలకు జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపల్ చైర్ పర్సన్ గా గొడిసెల సంధ్యారాణి రాజా రమేష్ (బిఆర్ఎస్), వైస్ చైర్ పర్సన్ గా మిట్టపల్లి సరిత శ్రీనివాస్ (సిపిఐ) లు సోమవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బిఆర్ఎస్, సిపిఐ శ్రేణులు ర్యాలీగా వెళ్లి ముందుగా పట్టణంలోని రామాలయం, అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రామాలయం చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపానికి నివాళులు అర్పించారు. అక్కడి నుండి ర్యాలీగా సూపర్ బజార్ చౌరస్తాలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, జయశంకర్ చౌరస్తా వద్ద గల జయశంకర్ విగ్రహానికి, పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్, కేసిఆర్ చిత్రపటాలను చేత బట్టి పట్టణ మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని, కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దస్త్రాలపై అధికారిక సంతకాలు చేసి, బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం అనంతరం వారికి క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా బిఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత లు మాట్లాడుతూ, క్యాతనపల్లి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. సమర్థవంతమైన పనితీరుతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుపుతామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, సిపిఐ వార్డు కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బిఆర్ఎస్, సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎర్రోళ్ల విజయశ్రీనివాస్‌కు 'దళితరత్న' పురస్కారం

- ఘనంగా సన్మానించిన వివిధ పార్టీల నాయకులు
- నిబద్ధత గల వ్యక్తులకు ఇటువంటి పురస్కారాలు లభించడం గర్వకారణం : తుడుం రమేష్ బాబు



**మేడ్చల్, ఏప్రిల్ 6 (అక్షరకలం):**

భారత మాజీ ఉపప్రధాని, బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, మేడ్చల్ మార్కెట్ డైరెక్టర్ ఎర్రోళ్ల విజయశ్రీనివాస్ ప్రతిష్ఠాత్మకమైన 'దళితరత్న' అవార్డును అందుకున్నారు. సమాజ సేవలో ఆయన అందిస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా విజయశ్రీనివాస్ ఈ అవార్డును గెలుచుకున్న సందర్భంగా, ఎమ్మార్పీఎస్ నాయకుడు తుడుం రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆయన నివాసంలో సోమవారం శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుడుం రమేష్ బాబు మాట్లాడుతూ విజయశ్రీనివాస్ వంటి నిబద్ధత గల వ్యక్తులకు ఇటువంటి పురస్కారాలు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నతమైన అవార్డులతో పాటు పదవులను అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం దళితరత్న అవార్డు గ్రహీత ఎర్రోళ్ల విజయశ్రీనివాస్ మాట్లాడుతూ ఈ అవార్డు తన గుర్తింపుతో పాటు తన బాధ్యతను మరింత పెంచిందని, నిరంతరం ప్రజల సేవలో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తొంట యాదయ్య, తొంట సుధాకర్, తొంట నరేందర్, దమ్మన్నగారి ప్రభాకర్, కె. శేషిధర్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మందమర్రి, ఏప్రిల్ 06 అక్షర కలం ప్రతినిధి:**



భారతీయ జనతా పార్టీ (బిజెపి) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ, ఏప్రిల్ 6,1980న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, ఎల్కే అద్వానీ లు దేశ అభివృద్ధి కోసం, పేద ప్రజలకు సంక్షేమ కోసం, దేశంలో కొనసాగిస్తున్న అరాచక పాలనను తరిమికొట్టడానికి బిజెపి పార్టీ స్థాపించడం జరిగిందని తెలిపారు. 1984 లో కేవలం రెండు ఎంపీ సీట్ల తో ప్రారంభమైన బిజెపి పార్టీ ప్రస్థానం, అంచలంచెలుగా ఎదిగి, 303 సీట్లు సాధించిందన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడు సార్లు అధికారం చేపట్టి, 21 రాష్ట్రాలలో అధికారంలో ఉందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం పని చేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అని స్పష్టం చేశారు. కార్యకర్తల కృషి వల్లనే పార్టీ ఈ స్థాయికి ఎదిగిందని, కార్యకర్తలకు గుర్తింపు ఒక్క బీజేపీ పార్టీలోనే దక్కుతుందన్నారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని యువకుడైన యువ కార్యకర్త నితిన్ నబిన్ ను చేసిన ఘనత బీజేపీ మాత్రమే అని తెలిపారు. రాబోయే రోజుల్లో కార్యకర్తల కృషితో రాష్ట్రంలో సైతం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డివి దీక్షితులు, నాయకులు రోడ్డ మోహన్, రంగు శ్రీనివాస్, శనిగారపు శ్రీనివాస్, రాములు, సత్యం, ఓం ప్రకాష్, జక్కుల మహేష్, ప్రవీణ్, తిరుపతి, నాగరాజు లు పాల్గొన్నారు.

# ఏరియా వర్క్ షాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మందమర్రి, ఏప్రిల్ 06 అక్షర కలం ప్రతినిధి;**

సింగరేణి ఏరియాలోని ఏరియా వర్క్ షాప్ లో నెలకొన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ జాయింట్ కార్యదర్శి కంది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూనియన్ వర్క్ షాప్ పిట్ కార్యదర్శి ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం వారు వర్క్ షాప్ ను సందర్శించి, వర్క్ షాప్ ఉద్యోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సర్వీస్ కేబుల్ సరఫరా లేదని, కార్మిక వాడల్లో వీధి దీపాలు సరిగా లేవని, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి వర్క్ షాప్ లో ఎలక్ట్రీషన్లు, జనరల్ అసిస్టెంట్ల కొరత ఉందని, గ్యారేజ్ లో మెకానిక్ లు, జనరల్ అసిస్టెంట్ ల కొరత ఉందని ఆరోపించారు. మహిళా ఉద్యోగుల వాష్ రూమ్లు, డ్రైవర్ల సమస్య ఉందని తెలిపారు. డ్రైవర్లు వర్క్ షాప్ లో పనిచేసిన తర్వాత టైం అయిన తర్వాత వేరే గనులకు, డిపార్ట్మెంట్ లకి అక్కడ ఏదైనా అవసరం పడితే అక్కడికి వెళ్ళమంటున్నారన్నారు. కార్మికులు తెలిపిన సమస్యలను వర్క్ షాప్ యాజమాన్యంతో మాట్లాడి, పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిందంగా గత స్ట్రక్చరల్ సమావేశంలో యాజమాన్యం ఒప్పుకున్నా సొంతింటి పథకం, పెర్క్ పై ఐటీ తిరిగి యాజమాన్యమే చెల్లింపు, మెడికల్ బోర్డ్ వెంటనే కొనసాగించాలని, సింగరేణికి రావాల్సిన 51,000 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాలని, ఓబీ టెండర్ డీజిల్ కుంభకోణాలపై విచారణ చేపట్టి, దోషులను శిక్షించాలని, సింగరేణిలో కొత్త గనులను ప్రారంభించాలని రాష్ట్ర



ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సింగరేణిలో నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా నాయకులు పి బాణయ్య, టేకుమట్ల తిరుపతి, కన్నం వేణు, తోట వెంకటస్వామి, కొండ్రు మురళి వెంకటేష్, కల్వల శ్రీనివాస్, రాజశేఖర్, దుర్గ ప్రసాద్, కుమారస్వామి లు పాల్గొన్నారు.

# సింగరేణి సెక్యూరిటీ గార్డులకు వెంటనే విధులు కల్పించాలి

## టెండర్ ముగియడంతో రోడ్డున పడ్డ 220 కుటుంబాలు

## సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



**మందమర్రి, ఏప్రిల్ 06 అక్షర కలం ప్రతినిధి:**

సింగరేణి ఏరియాలోని ఎస్ అండ్ పిసి విభాగంలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పాత టెండర్ ముగిసినప్పటికీ కొత్త టెండర్ విషయంలో సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు 220 సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డాయని, వెంటనే సెక్యూరిటీ గార్డులను విధుల్లోకి తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డులతో కలిసి పట్టణ మార్కెట్ ప్రాంతంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం మార్కెట్ ప్రాంతంలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు టెండర్ ఆలస్యాన్ని కారణంగా చూపిస్తూ, ఉపాధి నుంచి దూరం చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలరోజులుగా రేపు మాపు అంటూ టెండర్ ప్రక్రియను లాగడం వలన కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని తెలిపారు. సింగరేణి ఆస్తులను కాపాడే సెక్యూరిటీ గార్డులకే పని రక్షణ లేకుండా పోవడం దురదృష్టకరమన్నారు. ఏరియా జీఎం, సంబంధిత అధికారులు స్పందించి, కొత్త టెండర్ లను పిలిచి, పాత కార్మికులందరిని ఎలాంటి షరతులు లేకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని మరింతగా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల పోరాటానికి సిఐటియు అనుబంధ సంఘాలన్నింటిని, ప్రజల మద్దతును కూడగట్టి, పెద్ద స్థాయిలో ఉద్యమం చేపడుతామని స్పష్టం చేశారు. నేటి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పోరాటానికి మద్దతుగా నిలిచిన సిఐటియు జిల్లా కమిటీతో పాటు మున్సిపల్ యూనియన్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, బెల్లంపల్లి మండల కార్యదర్శి చల్లూరి దేవదాస్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి కాసర్ల రాజలింగు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో బీజేపీ బలోపేతానికి కృషి

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘటనామహామంత్రి చంద్రశేఖర తివారి, రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్ర రావు ఆధ్వర్యంలో పసుమర్తి సతీష్ పార్టీ కండువా ధరించారు. అనంతరం ఆయన వారి ఇరువురికి తన చేతుల మీదుగా చిరు సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు ఖమ్మం నగరంలో పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, రాబోయే కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సతీష్‌కు దిశానిర్దేశం చేశారు. దీనిపై స్పందించిన పసుమర్తి సతీష్ పార్టీ బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఖమ్మం నగరంలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

# ఇర్ఫా.స్వాతిని అభినందించిన ఐటీడీఏ, పిఓ, బి.రాహుల్,



**అక్షర కలం / భద్రాచలం**

గిరిజన సంక్షేమఆశ్రమమరియు గురుకులాల్లోచదువుతున్నవిద్యార్థినీ,విద్యార్థులు చదువుకుంటూ వారికి ఇష్టమైనకళలుమరియుచిత్రలేఖనంలపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో ప్రతి ఒక్కరికిజీవనోపాధిపెంపొంది ంచుకోవడానికిఎంతోఉపయోగ పడతాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిబి.రాహుల్ అన్నారు.సోమవారం నాడు తన చాంబర్లో గిరిజన సంక్షేమ శాఖ గురుకులం డిగ్రీ కళాశాల ఖమ్మం లో బిఎ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇర్ఫాస్వాతి వివిధ కళలకు సంబంధించిన చేతితో చిత్రీకరించిన పెయింటింగ్ చిత్రాలను ఆయన పరిశీలించారు.ఇర్ఫా స్వాతి చదువుకుంటూ కళల పట్ల దృష్టి సారించి పెయింటింగ్ చిత్రాలు పట్ల ఆసక్తి చూపించి ఆమె గీసిన చిత్రాలు చాలా అందంగా ఉన్నాయని అందుకు ఆ పాపను అభినందిస్తూ గిరిజన మ్యూజియంలో పాత తరం ట్రైబల్ కుసంబంధించినపెయింటింగ్ చిత్రాలను ట్రైబల్ మ్యూజియంలో ప్రదర్శనకు ఏర్పాటు చేస్తామని అలాగేకళాశాలఅభివృద్ధికి మరియు పెయింటింగ్ చిత్రాలుచిత్రీకరిస్తున్నవిద్యార్థినిలను స్వయంఉపాధికోర్సులకుప్రోత్సహించడానికి అలాగే డిగ్రీ చదువులతో పాటు ఈ విద్యా సంవత్సరం వివిధ రకాల స్వయం ఉపాధి కోర్సులు ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. అనంతరం ఖమ్మంలోని డిగ్రీ కళాశాలలో అభివృద్ధి పనులకు రెండు లక్షల రూపాయల చెక్కును మరియు పెయింటింగ్ చిత్రాలు చిత్రీకరించినఇర్ఫాస్వాతికిప్రోత్సాహకంగా ఇరవై రెండు వేల ఐదు వందల రూపాయల చెక్కును అందించి ఈ పెయింటింగ్ చిత్రాలకు గుర్తింపు పొందేలా తప్పనిసరిగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం ఈర్పస్వాతిచిత్రీకరించిన పదహారు రకాల వివిధ భంగిమలు గల పెయింటింగ్ చిత్రాలను పిఒకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రజని,కళాశాల టీం లీడర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీవారుఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్,మందా. నాగరాజు,

**అక్షర కలం / బూర్గంపహాడ్**



భద్రాద్రి కొత్తగూడెంజిల్లాబూర్గంపాడు మండల కేంద్రంలోని నూతనంగా బూర్గంపాడు గ్రామపంచాయతీ ఏర్పాటుచేసిన చెలివేంద్రాన్ని ప్రారంభించిన బూర్గంపాడు సర్పంచ్ మందా.నాగరాజు,మరియుఉపసర్పంచ్ గుండె.వెంకన్న, పాలకవర్గ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు. నిత్యంరద్దీగాఉండేప్రదేశంబూర్గంపాడు మండల కేంద్రంలోనిగ్రామస్తులకు ప్రయాణికులకు దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు బూర్గంపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసినచలివేంద్రనీ బూర్గంపాడు సర్పంచ్ మందా.నాగరాజు,ఏర్పాటుచేయించారు అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారుబూర్గంపాడుపంచాయతీ సెక్రెటరీ బర్ల.ప్రభాకర్,పాలకవర్గ సభ్యులు భజన.పెదనాగం,నాగ ప్రవల్లిక,నస్రిన్,గ్రామపంచాయతీ సిబ్బంది అనిల్,దిలీప్,బూర్గంపాడు మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ ఆటో కార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

## 225 కోట్లతో అధునాతనంగా పునర్నిర్మాణం

## ఆధునీకరణ పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన

## ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ

## మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం

**నిర్మల్,**

నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారని ప్రశస్తి. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది. జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజగోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.. గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్ఎ÷–లాన్‌లో భాగంగా చేపట్ట నున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



# ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి అంకురార్పణ

– శంకుస్థాపన చేసిన తుంబూరు దయాకర్ రెడ్డి

– కైకొండాయిగూడెంలో ఆధ్యాత్మిక కోలాహలం



**అక్షర కలం/ ఖమ్మం నగరం :**

ఖమ్మం కల్చరల్ : ఖమ్మం నగరం ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలో వెలిసిన ముత్యాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

**శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు..**

ప్రముఖ వేద పండితుడు బాదంపూడి రామలింగేశ్వర శర్మ పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర క్రతువులను వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం నిర్విఘ్నంగా పూర్తి కావాలని, ఈ ప్రాంత ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పురోహితులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగటి శ్రీను, నాగటి ఉపేందర్, తుళ్లూరి మాధవరావు – కోటేశ్వరి దంపతులు, మద్దినేని ప్రసాద్, ఆళ్ల రమేష్, గద్దల నాగేశ్వరరావు, గద్దల చిన్నప్ప, తుళ్లూరి కృష్ణయ్య, కొల్లు వెంకటేశ్వర్లు, పందుల తిరుపతిరావు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ జరిగింది.

# భూదాన్ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## రైతులకు ఇచ్చిన భూమిలో ఇండ్ల నిర్మాణాలు చేయటం సరైంది కాదు

## పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు భూమి అప్పగించాలి

## విలేకర్ల సమావేశంలో బోధన్ రైతుల ఆవేదన

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం వెలుగుమట్ల భూధాన్ భూమిలో భూదాన్ బోర్డు వారు 31.7 ఎకరాల భూమిని 27 మంది నిరుపేద రైతు కూలీలకు భూములు అప్పగించటం జరిగిందని, 1953 నుంచి 1960 మధ్యకాలంలో ఈ భూములను సాగు కోసం నిరుపేద రైతులకు ఆనాడు అప్పగించటం జరిగిందని బోధన్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలుగుమట్ల భూధన్ రైతులు వారి కుటుంబ సభ్యులు బందెల వెంకన్న, బందెల కృష్ణ, రెంటపల్లి మోతరయ్య, ఎస్ కే జానీ మియా లు మాట్లాడుతూ... బోధన్ బోర్డు వారు 1953 నుంచి 1960 సంవత్సర మధ్య కాలంలో పుట్టకోట, గొల్లగూడెం, గోపాలపురం తదితర గ్రామాలకు చెందిన 27 మంది నిరుపేదలకు సర్వే నెంబర్ 147, 148, 149 సర్వే




నెంబర్లలో 31.7 ఎకరాల భూమిని దానంగా సాగు కోసం ఇచ్చారని తెలిపారు. శీలం మంగయ్యకు రెండు ఎకరాలు, షేక్ సైదులు కు ఎకరం 20 కుంటలు, హాబీ కి రెండు ఎకరాలు, రెడ్డి బోయిన రంగయ్యకు రెండు ఎకరాలు, బందెల లక్ష్మయ్యకు ఎకరం, షేక్ అక్బర్ సాబ్ కు రెండు ఎకరాలు, మద్దెల లచ్చయ్యకు ఎకరం, యలీజాల పున్నయ్యకు ఎకరం, మహమ్మద్ ఖాసిం కు ఎకరం 20 గుంటలు , దోమల అచ్చయ్యకు రెండు ఎకరాలు రెంటపల్లి సుబ్బయ్యకు రెండెకరాలు, పల్నాటి చంద్రయ్యకు రెండు ఎకరాలు ఇలా 27 మందికి భూధాన్ బోర్డు వారు పంట సాగు చేసుకునేందుకు వ్యవసాయ రైతు కూలీలకు భూములు అప్పగించటం జరిగిందని వెల్లడించారు. గత ఏడు సంవత్సరాల క్రితం కొందరు వ్యక్తులు తమపై దౌర్జన్యానికి దిగి మా భూములలో గుడిసెలు వేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకున్న తమను తమ కుటుంబ సభ్యులను కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి దిగి కొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ఆ గుడిసెలను తొలగించి గుడిసెలు కోల్పోయిన వారికి అదే స్థలంలో ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి హక్కు కలిగిన రైతులకు కనీసం సమాచారం ఇవ్వకుండా మా భూములను ఎలా ఇతరులకు కేటాయిస్తారని ప్రశ్నించారు. పహాని, పట్టాదారు పాసుపుస్తకాలు హక్కు కలిగి ఉన్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని వారు జోక్యం చేసుకొని భూములు కోల్పోయిన నిరుపేద రైతులమైన తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో దోమల నాగరాజు, పర్నాటి బుచ్చి రాములు, లకావత్ నాగేశ్వరరావు, దోమల రాము, గండికోట మనీ, కుర్ర రామ సైదులు, ఎస్కే జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు!

**అక్షర కలం/ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న ఏటపాక, కన్నాయి గూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తమపట్నం, గుండాల, పంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రంతో కలిసి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో ఉన్నాయని వివరించారు. ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారుభద్రాచలం పట్టణ అభివృ ద్ధికి, పాలనా సౌలభ్యానికి ఈ గ్రామాలు అత్యంత కీలకమని, వీటిని తెలంగాణలో కలపడం ద్వారానే స్థానిక గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన లేఖలో పేర్కొన్నా రు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే దీనికి సంబంధించిన విలీన బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన కేంద్రాన్ని కోరారు.ఈ అంశం రెండ్రోజుల క్రితం



రాజ్యసభలోనూ ప్రస్తావన కు వచ్చింది. ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో తెలంగాణ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ఉండాలని కోరుకున్న గిరిజనులను బలవంతం గా ఏపీలో కలిపారని ఆమె మండిప డ్డారు. విభజన హామీలైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ వంటి అంశాల్లో కేంద్రం తెలంగాణ కు మొండిచేయి చూపిస్తోం దని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రయోజనాల కోసం విభజన చట్టాన్ని వాడుకుంటున్నారని.. తక్షణమే ఐదు గ్రామాలను తెలంగాణకు అప్పగించా లని ఆమె డిమాండ్ చేశారు. భద్రాచలం చుట్టూ ఉన్న ఈ గ్రామాలు భౌగోళి కంగా, సామాజికంగా తెలంగాణతోనే ముడిపడి ఉన్నాయని గుర్తు చేశారు.

# మరికల్‌లో బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం ;

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,06)**



మరికల్; మరికల్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంగలి వేణుగోపాల్, మాజీ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, సుశాసనం, ప్రజాసేవను లక్ష్యంగా బీజేపీ నిరంతరం పని చేస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సాంస్కృతిక విలువలు, ప్రజల సంక్షేమం కోసం పార్టీ చేసిన సేవలు ప్రశంసనీయమని, భారతదేశాన్ని శక్తివంతమైన అభివృద్ధి దేశంగా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, రాజేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శివకుమార్, బాలరాజు గౌడ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు చెన్నయ్య, బీజేవైఎం జిల్లా నాయకులు వెంకటేష్, రమేష్, గొల్ల రవి, అశోక్, రాము, వైడి గుప్త, శ్రావణ్, స్వామి, సోషల్ మీడియా మండల కన్వీనర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలి – జిల్లా కలెక్టర్ హైమావతి

అక్షర కలం, సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 : గురుకుల విద్యాలయాలలో, సంక్షేమ వసతి గృహాలలో వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ రంగదాంపల్లిలో గల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూలును ఆకస్మికంగా సందర్శించి వంటగదిని పరిశీలించారు. విద్యార్థుల కోసం చేస్తున్న వంటలను పరిశీలించి గ్యాస్ ను వృధా చేయకుండా పొదుపుగా వాడి పంటలను వేడివేడిగా విద్యార్థులకు పండించాలని అన్నారు. విద్యార్థులు అన్నం తినక ముందు తిన్న తర్వాత డైనింగ్ రూమ్ లను శుభ్రం చేయాలని, వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ కూరగాయలు, ఆకుకూరలు జాగ్రత్తగా పరిశుభ్రమైన ప్రాంతాలలోనే శుభ్రం చేసి



వంటకు ఉపయోగించాలని ప్రిన్సిపాల్ ను, వంట సిబ్బందిని ఆదేశించారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమన్వయంతో పని చేయాలి - జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న "హెల్త్ వీక్" కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేసి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. జిల్లాలో ఆరోగ్య సేవల బలోపేతం, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపు లక్ష్యంగా ఈనెల 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న "హెల్త్ వీక్" కార్యక్రమాలపై సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డ్రగ్స్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ అధికారులు, మెడికల్ మరియు నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపాళు పాల్గొన్నారు. హెల్త్ వీక్ సందర్భంగా రోజువారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, జిల్లా స్థాయి కార్యాచరణ, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలపై సమీక్షించి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 6 నుండి 11 వరకు జరగనున్న హెల్త్ వీక్ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఆయా కార్యక్రమాలలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత విస్తృతంగా పాల్గొనేలా




చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే ర్యాలీలను విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించాలని సూచించారు. హెల్త్ వీక్‌లో భాగంగాఏప్రిల్ 6 ఆహార భద్రత దినం, 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, 8 న సురక్షిత తల్లి దినం, 9న ఎయిడ్స్ అవగాహన ఢ నివారణ దినం 10 న హోమియోపతి, ఆయుష్ దినంఏప్రిల్ 11 న ఔషధ నియంత్రణ బలోపేత దినం కార్యక్రమాల సందర్భంగా సంబంధిత అంశాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు నిర్వహించిన



కార్యక్రమాలపై ఫోటోలు, వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డిఎంఅండ్ హెచ్ ఓ వసంత్ రావు, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ ఓ, జిజిహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ నాగనిర్మల, డాక్టర్ శశాంక్ ,డీడబ్ల్యూఓ లలిత కుమారి, డ్రగ్స్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ, జైలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఫుడ్ సేఫ్టీ కార్యక్రమంపై అవగాహన

## ర్యాలీ ప్రారంభించిన అదనపు కలెక్టర్...

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

నాణ్యమైన ఆహారం తీసుకోవడం వల్లనే మానవుని జీవన ప్రమాణం పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సర్దార్ పటేల్ స్టేడియం లో ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే ను ఘనంగా నిర్వహించారు. తోలుత అయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆహార భద్రత ప్రమాణాలపై ప్రజలు మరియు ఫుడ్ వ్యాపారుల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన కలిపించాల్సిన అవసరం ప్రతీఒక్కరిపైన ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల్లో ఆదరణ పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కొద్దిసేపు స్టేడియం లో కొంతమందితో ఆహారపు అలవాట్ల గూరించి మాట్లాడించారు. ఆహార నాణ్యత కు సంబంధించి నీఖచ్చిగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆందోళన



వ్యక్తంచేశారు. దీనికోసం సంబంధిత శాఖ అధికారులు నిరంతరం ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు చేపటరాలని సూచించారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతపురం సర్దార్ పటేల్ స్టేడియం నుండి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు నిర్వహించబడింది. ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది, ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు ఆహార భద్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఐ ఏ ఎస్, ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో, గౌరవనీయులైన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాస్ రెడ్డి నెతృత్వంలో జరిగిన



కార్యక్రమంలో జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, జిల్లా ఆసువత్రుల కోఆర్డినేటర్ రాజశేఖర్ గౌడ్, యువజన మరియు క్రీడా శాఖ అధికారి శ్రీ సునీల్ రెడ్డి, జిల్లా ఫుడ్ ఇనిస్పెక్టర్ కిరణ్ కుమార్, సూపర్ వైజర్ జడ్ ఎస్ జయపాల్, బిట్టా ప్రవీణ్ కుమార్, మరియు ఫుడ్ సేఫ్టీ విభాగం ఖమ్మం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పలువురు అధికారులతో పాటుగా ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు...

# ప్రజావాణి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారంపై నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని, అందువల్ల ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,ఇతర సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన కే. నరేందర్ ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 58 ప్రకారం ఎస్సీ కాలనీ లో ఇండ్ల స్థలం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నానని, స్థలం పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన జి. దేవిశ్రీ, సింగరేణి మండలం ఉసిరికాయల పల్లి రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్ 548 లో తమ అత్తమామకు భూమి ఉందని, అత్తమామల మరణాంతరం తన భర్త కూడా మరణించారని, ఆ భూమి జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, తమ భర్తకు రావలసిన నష్టపరిహారం తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ జి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఏన్కూరు మండలం బద్రుతండ, ఒంటి గుడిసె గ్రామ ప్రజలు గ్రామ పరిధిలో గుట్టల నుండి అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను నిలిపివేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, భూగర్భ శాఖ సహాయ సంచాలకులకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# భారత కార్మిక ఉద్యమానికి మార్గదర్శి బీటీ రణదీవె

### కార్మిక వర్గం తోనే కడవరకు ఎర్ర శ్రీకాంత్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

భారతదేశ కార్మిక ఉద్యమానికి దిశా నిర్దేశం చేసి సిఐటియు నిర్మాణానికి ఆహరహం కృషి చేసిన కార్మిక ఉద్యమ మార్గదర్శి బీటీ రణ దివే అని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర కొనియాడారు. సోమవారం బీటీ రణధీవె, ఎర్ర శ్రీకాంత్ వర్ధంతి సభ స్థానిక హమాలి అడ్డాలో హమాలి మేస్త్రి ఆరేళ్ల శ్రీరాములు అధ్యక్షతన జరగగా కే నరేంద్ర మాట్లాడుతూ ఐక్యత పోరాటం నినాదంతో 1970లో ఏర్పడిన సిఐటియు సంఘటిత సంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతూ కార్మికోద్యమం దశదిశల వ్యాపింప చేయడానికి బి టి ఆర్ చేసిన కృషి అమోఘమని, అన్ని రకాల కార్మిక సంఘాలను ఐక్యం చేసి కార్మిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన బి టి ఆర్ జీవితం ధన్యమని కొనియాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి పని గంటల పెంపు, కనీస వేతనం అమలు, సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కులను కాలరాస్తూ కార్మికులను దోపిడీ చేసుకునే విధంగా కార్పొరేట్ అధిపతులకు కార్మికులను బలి పశు వులుగా చేయడం దుర్మార్గమని వీటికి వ్యతిరేకంగా పోరాడిన బి టి ఆర్,యర్ర శ్రీకాంతుల



బాటలో నడిచి ముందుకుపోయి కార్మిక కర్షక మైత్రితో సమరశీల పోరాటాలు నిర్వహించి పాలకుల మెడలు వంచి కార్మిక కర్షక రాజ్యం తేవడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని అందుకు సిఐటియు నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కే నరేంద్ర పిలుపునిచ్చారు. బి టి ఆర్, ఎర్ర శ్రీకాంత్ల చిత్రపటాలకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కే లోతు రవి, ఆ రెల్లి శ్రీరాములు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు ముక్కా సీతారాములు, రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, తురక సంపత్, తిరపయ్య, సైదులు, బాబు, కోటయ్య, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు అనుకల నగేష్ పాల్గొన్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాలోనే నెంబర్ వన్ మిర్చి మార్కెట్‌గా తీర్చుదిద్దుతాం

### గంగాపూర్ మిర్చి మార్కెట్ ను ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 06**





ఈ రోజు చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో వివిధ సమస్యలతో మూతపడిన గంగాపూర్ మిర్చి మార్కెట్ ను ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ నంగునూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి రైతుల తో క కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగాపూర్ మిర్చి మార్కెట్ ను జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు వివేక్ వెంకటస్వామి సహకారంతో ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అశీ 1మార్కెట్ గా తీర్చుదిద్దుతామని అందుకు రైతులు సహాకరించాలని మార్కెట్ కమిటీ సూచించిన గంగాపూర్ సెంటర్ పాయింట్ లోనే మిర్చి అమ్మితే మంచి ధర వచ్చి రైతులకు సకాలంలో డబ్బులు అందేవిధంగా మార్కెట్ కమిటీ చూసుకుంటుందని అదేవిదంగా పేద్ద ఎత్తున మిర్చి కొనే ఎజెంట్లను కూడా తీసుకువచ్చే విధంగా కృషిచేస్తామని తెలియజేశారు. అంతేకాకుండా మార్కెట్ కు మిర్చి తీసుకువచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాగునిటీ సరఫరా టాయిలెట్స్ ఇలా అన్నీ జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్,డైరెక్టర్ లు నముండ్ల వినోద్,అనుపటి విజయ్ కుమార్ రెడ్డి, మసిరెడ్డి మైపాల్ రెడ్డి,దేవరాయ,సోనీ, శేఖర్,రాగుల అశోక్,ఉండెల్లి నాగరాజు,తాళ్లపల్లి రాజు, ఉప సర్పంచ్ బండి తిరుపతి,వార్డ్ మెంబెర్లు ఐలేని వెంకటరెడ్డి, స్వామి రెడ్డి చిన్నకోడూరు మండల్ ఉపాధ్యక్షులు సండెబోయిన పర్శరాములు ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ రాజేష్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదుగాని లహరి ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్ యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అనంతగిరి చంద్రశేఖర్,గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టిపర్తి చందు, రామకృష్ణ గంగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ఉప అధ్యక్షులు వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు సిద్దిపేట రాజిరెడ్డి, పిట్ల కిష్టయ్య, బుస్సా రాంచెంద్రం, తిరుపతి రెడ్డి, ఎర్ర మోహన్,హమాలీ ప్రెసిడెంట్ స్వామి పెద్ద సంఖ్య లో రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రైతు ప్రభుత్వం

### రైతుల ఓట్లు కావాలి కానీ రైతు బాగోదు వద్దు

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 06:**



ఈరోజు సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో 63 కెవి ట్రాన్స్ఫార్మర్ సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పూజాల హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ పూజల హరికృష్ణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి రైతులు ట్రాన్స్ఫార్మర్ ఓవర్ లోడ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ తరచుగా కాలిపోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయి పంటలు ఎన్నుకోవడంతో రైతులు భారీ నష్టాలను ఇచ్చేవి చూశారని అన్నారు. ఈ సమస్యను రైతులు పలుమార్లు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు మరియు స్థానిక బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడుతున్న పంటలు ఎండిపోతున్న, ఏ బి ఆర్ ఎస్ నేత కూడా స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్సాన్ పల్లి గ్రామస్తులు మరియు రైతులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన పూజల హరికృష్ణ సంబంధిత అధికారులతో మాట్లాడి 63 కెవి ట్రాన్స్ఫర్ట్ మంజూరు చేయించి ఏర్పాటు చేయించి రైతుల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ట్రాన్స్ఫార్మర్ను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం కావడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడి రైతులకు సాగునీటి సమస్య తగ్గి వ్యవసాయ పనులు చలవతరమవుతాయని తెలిపారు. విద్యుత్ సమస్యలు తగ్గడంతో గ్రామాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆశాభావం చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు నిరంతర విద్యుత్ సాగునీటి సౌకర్యాలు కల్పిస్తూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మరియు రైతులు మాట్లాడుతూ తమ సమస్యలను గుర్తించి తక్షణమే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయించిన సిద్దిపేట నియోజకవర్గ పూజల హరికృష్ణకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు కొలిమి బిక్షపతి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కలిముద్దీన్ అహ్మద్, గ్రామ శాఖ అధ్యక్షులు కట్కూరు సత్యనారాయణ, ఉప సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఓబిసి సెల్ మండల అధ్యక్షులు బొల్గం నవీన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకృష్ణమూర్తి, అంబటి మహేష్, చిన్నకోడూరు ఏఎంసి వైస్ చైర్మన్ వంశీ, ఎన్ ఎస్ యు ఐ రాకేష్, కంది దుర్గారెడ్డి, మోతే రమేష్ రెడ్డి, వార్డ్ మెంబర్ కనకయ్య, పూస రమేష్, ఎల్లం కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవనానికి ఈట్ రైట్ వాక్...

### - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....

**మెదక్ /కొల్చారం ఏప్రిల్ 06 (అక్షరకలం):-**

పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకో శరీరానికి వ్యాయామాన్ని అందించు ఆరోగ్యకరమైన సమాజానికి నాంది పలుకు పండుగ వాతావరణంలో ఈట్ రైట్ - వాక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆహార భద్రతపై ప్రత్యేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్లో ఈట్ రైట్ - వాక్ కార్యక్రమాన్ని నిర్వహించగా, లిజిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి రాందాస్ చౌరస్తా వరకు వాకింగ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ డిపార్ట్మెంట్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ పై పటిష్ట చర్యలు చేపట్టారు.ఈట్ రైట్ ఫైట్ డీసీజ్, హెల్త్, ఫుడ్ సేఫ్టీ, సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ, ఎడ్యుకేషన్, ఫారెస్ట్, పోలీస్ స్పోర్ట్స్, ఇరిగేషన్, మత్స్యశాఖ, ఇండస్ట్రీస్ జిల్లా పరిషత్,వివిధ శాఖల జిల్లా అధికారులు వారి సిబ్బంది, పాల్గొన్నారు ఈరోజు సరైన ఆహారం ఆరోగ్య భవిష్యత్తు, ప్లే కార్డులు చేత బూని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది.రాందాస్ చౌరస్తాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ హెల్త్ వీక్ కార్యక్రమంపై సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' - 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈరోజు నుండి వారం రోజులపాటు హెల్త్ వీక్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లాలోని ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యం కోసం సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని, ఫాస్ట్ ఫుడ్కు దూరంగా




ఉండి, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు వంటి సహజ ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుని శరీరానికి చక్కటి వ్యాయామాన్ని అందించి ప్రతి వ్యక్తి ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. శరీరానికి. శక్తిని అందించాలంటే ప్రోటీన్స్ తప్పనిసరిగా ఉండాలని ఫైబర్, ప్రోటీన్స్ ఉండే ఆహార పదార్థాలను ఎక్కువ తీసుకోవాలి కార్బోహైడ్రేట్స్ ను తగ్గించి తీసుకోవాలన్నారు శరీరానికి ఆహారం ఎంత అవసరమో వ్యాయామం కూడా అంతే అవసరమని చెప్పారు. ఈ హెల్త్ కి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో పనిచేసే ఉత్తమ వర్కర్ లను గుర్తించి, సత్కరిస్తున్నామన్నారు..ఏప్రిల్ 8న రక్షిత మాతృత్వ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సురక్షిత ప్రసవాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, పోషకాహారంపై విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు.ఏప్రిల్ 9న ఎయిడ్స్ నియంత్రణపై రెడ్ రన్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే ఎయిడ్స్ నివారణపై కళాజాతలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఏప్రిల్ 10న హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా కేజీబీవీల్లో, యోగా కేంద్రాల్లో యోగా సాధన చేయించాలని, అలాగే ఆయుష్ పై ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 11న మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై వ్యాస రచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డి .సి హెచ్ డాక్టర్ శివ దయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఎఫ్ఓ జో.జి, డీఈఓ విజయ, బి డబ్ల్యు.ఓ హేమ భార్గవి,ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మత్స్య శాఖ అధికారి, మున్సిపాలిటీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955